ప్రభాత
# కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
ఆదివారం 21 సెప్టెంబర్ 2025

## పాఠశాలను సందర్శించిన సమాచార హక్కుచట్టం చీఫ్ కమిషనర్

చాపాడు. సెప్టెంబర్ 20. ప్రభాతవార్త:



మండలంలోని నక్కలదీన్నె మోడల్ ప్రైమరీ పాఠశాలను శనివారం సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్ ఆర్ మహబూబ్ బాషా సందర్శించారు, ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులతో మమేకమై ముచ్చటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన తండ్రి ఇక్కడే విధులు నిర్వహిస్తున్నప్పుడు ఇదే పాఠశాలలో చదివానని పాఠశాల లో చదివిన రోజులను గుర్తు చేసుకున్నారు అప్పటికి ఇప్పటికి ఊరు మారలేదు కానీ పాఠశాల రూపురేఖలు చాలా మారాయని సంతోషం వ్యక్తం చేశారు అదేవిధంగా పిల్లలు బాగా చదివి చదువుకున్న పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు డిఎస్పి రాజేంద్రప్రసాద్, రూరల్ సీఐ శివశంకర్, ఎస్ఐ చిన్న పెద్దయ్య,, ఎంఈఓ రవిశంకర్, వంశీకృష్ణ, మాజీ చాపాడు ఛానల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ సోమల మహేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు శోభన్ బాబు, కృష్ణయ్య, బీడీసీ రవిశంకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర బైక్ దొంగను పట్టుకున్న పోలీసులు,

మైదుకూరు, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త:

అంతర్రాష్ట్ర బైకు దొంగ నుండి పది లక్షల విలువ చేసే పది మోటర్ బైకులు స్వాధీనం చేసుకున్న పోలీసులు, కడప జిల్లా మైదుకూరు డివిజన్ డీఎస్పీ కార్యాలయంలో వివరాలు వెల్లడించిన మైదుకూరు డిఎస్పి రాజేంద్రప్రసాద్,అంతరాష్ట్ర బైక్ దొంగను పట్టుకున్న మైదుకూరు రూరల్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ శివశంకర్,బ్రహ్మంగారిమఠం సబ్ ఇన్ స్పెక్టర్ శివ ప్రసాద్, కానిస్టేబుళ్లు మధుసూదన్ రెడ్డి, హుస్సేనయ్య, బ్రహ్మేంద్ర లను నగదు బహుమతి ఇచ్చి అభినందించిన డిఎస్పి రాజేంద్రప్రసాద్,ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబాలకు మంత్రి భరోసా

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు చెక్కు పంపిణీ



బాధిత కుటుంబాలకు చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి, కలెక్టర్




మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి

రాయచోటి సెప్టెంబర్ 20 ప్రభాతవార్త

రాయచోటి అన్నమయ్య జిల్లాలో భారీ వర్షాల వల్ల చనిపోయిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక మృతుడికి ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు శనివారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఎస్పీ ధీరజ్ భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా కే రామాపురం నాలుగు కులాల వద్ద గల్లంతైన బాలిక యామిని కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు ఎస్ఎన్ కాలనీలో మృత్యువాత పడిన ముగ్గురు కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ బాధ్యత కుటుంబాలను కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని మంత్రి భరోసా ఇచ్చారు రాష్ట్ర ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి 5 లక్షల రూపాయల చెక్కులను మంత్రి రాంప్రసాద్ రెడ్డి జిల్లా కలెక్టర్ అందించారు అంతేకాకుండా మండిపల్లి నాగిరెడ్డి ట్రస్ట్ ద్వారా అదనంగా లక్ష రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు భారీ వర్షం కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలను మంత్రి రాంప్రసాద్ రెడ్డి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఎస్పీ ధీరజ్ లు పరిశీలించారు భారీ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారిక యంత్రాంగం తగిన చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులకు ఆదేశించారు ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్డిఓ శ్రీనివాస్ తాసిల్దార్ నరసింహ కుమార్ మున్సిపల్ కమిషనర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గల్లంతైన యామిని మృతిదేహం లభ్యం

రాయచోటి సెప్టెంబర్ 20 ప్రభాతవార్త

రాయచోటి అన్నమయ్య జిల్లాలో శుక్రవారం కురిసిన భారీ వర్షాల కారణంగా కొత్తపేట రామాపురం నాలుగు కులాల వద్ద కాలవులో పడి యామిని (7) శనివారం ఉదయం శవంగా తేలింది. రామాపురానికి రెండు కిలోమీటర్ల దూరంలోని డ్రైనెజి లో పాప మృతదేహాన్ని గుర్తించారు. శుక్రవారం సాయంత్రం పాఠశాల నుంచి ఆటోలో వస్తున అధిక వర్షపు నీరు ఆటోలోకి చేరడంతో పాప కిందికి దిగి డ్రైనేజ్ కాలవలో కొట్టుకుపోయి మరణించింది. ఇదే సమయంలో పట్టణంలో మరో ముగ్గురు వ్యక్తులు కూడా వర్ష బీభత్సానికి బలయి మృతిచెందినట్లు అందరికి తెలిసిందే.





# రాజంపేట ఆర్టీసీ డిపోలో డిఎం సహా 6మంది సస్పెన్షన్

**పెట్రోల్ బంక్ లో 631.5 లక్షల నిధుల స్వాహ వ్యవహారం**

**ఉత్తర్వులు జారీ చేసిన కడప ఆర్టీసీ ఈడి**

**స్వాహా జరిగిన నిధులు ఎవరి నుంచి రికవరీ చేస్తారు?**

**కాంట్రాక్టర్కు బాధ్యత ఉందని నివేదికలో స్పష్టం**

**పెట్రోల్ బంక్ క్లోజ్**




రాజంపేట ఆర్టీసీ డిపో ఆవరణలోని పెట్రోల్ బంక్ కార్యాలయంకు తాళం వేసిన దృశ్యం

రాజంపేట, సెప్టెంబర్20 ప్రభాతవార్త

రాజంపేట ఆర్టీసీ డిపో ఆవరణలోని పెట్రోల్ బంకులో నిధుల స్వాహా వ్యవహారంలో నిరక్ష్యంపై ఉన్నతాధికారులు కొరడా ఝుళిపించారు.63.15 లక్షల నిధుల దుర్వినియోగానికి సంబంధించి రాజంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ రమణయ్య సహా ఐదు మంది పై వేటు వేస్తూ కడప ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉత్తర్వులు జారి చేశారు. నిధుల దుర్వినియోగం వ్యవహారంలో పెట్రోల్ బంక్ కాంట్రాక్టు పొందిన కాంట్రాక్టర్ చంద్రమోహన్కు కూడా బాధ్యత ఉందని విచారణ నివేదికలో స్పష్టం చేశారు. ఆరుగురు పై సస్పెన్షన్ వేటు వేసిన ఉత్తర్వులకు సంబంధించిన ఛార్జిషీట్ పత్రాలను కడప రీజినల్ మేనేజర్ గోపాల్ రెడ్డి స్వయంగా శనివారం రాజంపేటకు వచ్చి అందజేసినట్లు సమాచారం. రాజంపేట డిపో ఆవరణలోపెట్రోల్ బంక్ ఏర్పాటుచేసి నిర్వహణ చేసేందుకు సంస్థ టెండర్లు పిలిచింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఇక్కడ పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. బంక్ నిర్వహణ కోసం ఆర్టీసీ టెండర్లు పిలిచింది. నంద్యాలకు చెందిన కే చంద్రమోహన్ టెండర్ తగ్గించుకున్నారు. 14 మంది పెట్రోల్ పంపు బాయ్స్ ఏర్పాటు చేసేందుకు ఆర్టీసీ అనుమతి ఇచ్చింది.7.12.2024 నుంచి 6.12.2026 వరకు కాంట్రాక్టర్ పెట్రోల్ బంకు నిర్వహించాల్సి ఉంటుంది.అంటే సంస్థలో లావాదేవీలకు సంబంధించి కాంట్రాక్టర్కు బాధ్యత ఉంది. అంతేకాకుండా డిపో మేనేజర్ తో పాటు అకౌంట్స్ విభాగంలోనూ, ఇంధనం విభాగంలో పనిచేసే అధికారులకు బాధ్యత ఉంది. అయితే ఎవరు తమ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించలేదు. నిరక్ష్యంగా వ్యవహరించారు అధికారికంగా విధులు నిర్వహించాల్సిన వారు కూడా ఉదాహరణతగా వ్యవహరించారు. స్వయంగా డిపో మేనేజర్ మొబైల్ నెంబర్ కు ఫోన్ పే లింక్ చేశారు. ఆయన దాని గురించి పట్టించుకోలేదు. మరోవైపు క్రింది స్థాయిలో అకౌంట్స్ విభాగంలో కూడా నామమాత్రంగా విధులు నిర్వర్తించారు సాయంత్రం 5 గంటలకు విధులు ముగించుకొని వెళ్లేవారు. దీంతో పెట్రోల్ బంక్ లో పనిచేసే పంపు బాయ్స్ ఇష్టా రాజ్యాంగా మారింది. ఫలితంగా వారు సొంత మొబైల్ స్కానర్లు ఏర్పాటు చేసుకుని నిధులు కాజేశారు. మరికొందరు స్కానర్లు ట్యాంపరింగ్ చేశారు. ఈ విధంగా 53.38 లక్షలు నిధులు దుర్వినియోగమయ్యాయి. అలాగే మరో 9.77 లక్షలు మీటర్ రీడింగ్ లో తేడా కనిపించింది.సుమారు 9319 లీటర్ల పెట్రోల్, డీజిల్కు లెక్క లేకుండా పోయింది. దీంతో 63.15 లక్షలు నిధులు స్వాహా జరిగినట్లు విచారణ అధికారి తేల్చారు. ఈ నిధులు దుర్వినియోగం జరుగుతున్నా జవాబు దారితనం లేకుండా, నిరక్ష్యంగా, పట్టించుకోకుండా, కనీసం క్రాస్ చెక్ చేయకుండా, ఉదాశినతగా వ్యవహరించ దంతో సస్పెండ్ చేసినట్లు ఆర్టీసీ ఈడి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సస్పెండ్ అయిన వారిలోరాజంపేట ఆ ర్టీసీ డిపో మేనేజర్ రమణయ్య, మెకానికల్ ఫోర్ మెన్ ధరణి బాయ్, పిఆర్నాయుడు (డిసి), పిఎల్ నరసయ్య (ఎడిసి), పివీఎస్ నారాయణ (జేఏఎఫ్), డి, ఆర్ మోహన్ (సీనియర్ అసిస్టెంట్) సస్పెన్షన్ చేస్తూ కడప ఆర్టిసి ఈడి ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం నుంచి రాజంపేట డిపోలోని పెట్రోల్ బంకు కూడా మూసివేశారు. కార్యాలయానికి తాళం వేశారు. దీంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు.

## ఆరోగ్య జిల్లా.. అందరి బాధ్యత...!

కడప, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త :



స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా వైఎస్ఆర్ కడప జిల్లాను కాలుష్య రహిత ఆరోగ్య జిల్లాగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శనివారం కడప కలెక్టరేట్ ప్రాంగణంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ "స్వచ్ఛ దివస్" కార్యక్రమాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి అధికారులతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి 3వ శనివారం చేపడుతున్న స్వచ్ఛ దివస్ కార్యక్రమంతో స్వచ్ఛత వైపు అడుగులు వేయాలన్నారు. హరిత కడప సాధన కోసం జిల్లాలోని కడప నగరంతో పాటు అన్ని మున్సిపాలిటీలు, పంచాయతీల్లో విరివిగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలన్నారు. ప్రతి పౌరుడు మూడవ శనివారాన్ని స్వచ్ఛ ఆంధ్రగా పాటించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. జిల్లా అంతట పరిశుభ్రత కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని, తడి పొడి చెత్తల పై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. ఈ వేస్ట్ ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లో ఉంటుందని దాని పునర్వినియోగంపై ప్రజల్లో అవగాహన చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. మన జిల్లాను ఆరోగ్య జిల్లాగా, కాలుష్య రహిత జిల్లాగా తీర్చడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలోని అన్ని బ్లాకుల వద్ద ఆయా శాఖల అధికారులు, సిబ్బంది స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పిచ్చి మొక్కలను, చెత్తా చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, ఎస్డీసీలు, జెడ్పి సీఈవో ఓబులమ్మ, డిపివో రాజ్యలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలి




సంబేపల్లి సెప్టెంబర్ 20: ప్రభాతవార్త

పచ్చదనం మరియు పరిశుభ్రత లు వేల సంవత్సరాల మన సంస్కృతిలో భాగమని, జిల్లా ప్రజలందరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఉదయం సంబేపల్లి లో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ప్రతినెల మూడో శనివారం నిర్వహిస్తోందని సెప్టెంబర్ మాసం మూడో శనివారం రోజు "గ్రీన్ ఆంధ్ర ప్రదేశ్" అనే ఇతివృత్తంతో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. పరిశుభ్రత అనేది ఎన్నో వేల సంవత్సరాల నుండి మన సంస్కృతిలో భాగమని పాశ్చాత్య దేశాల వారు మన సంస్కృతి నుంచి పరిశుభ్రతను నేర్చుకొని అమలు చేస్తున్నారన్నారు. జిల్లా ప్రజలందరూ మొక్కలు నాటి వాటిని పెంచి జిల్లా వ్యాప్తంగా పచ్చదనాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ఇంట్లో అవసరాలకి ప్లాస్టిక్ కవర్లు కాకుండా క్లాత్ కవర్లను వినియోగించాలని సూచించారు.అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టర్ నిశాంత్ కుమార్ మొక్కను నాటి స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో చివరిగా మానవహారం ఏర్పాటు చేసి స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞను కార్యక్రమంలో పాల్గొన్న వారి అందరి చేత చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పాల ఏకిరి చైర్మన్ నాగేశ్వర్ నాయుడు జిల్లా గ్రామ వార్డు సచివాలయ శాఖ అధికారి లక్ష్మీపతి, జిల్లా పంచాయతీ శాఖ అధికారి రాధమ్మ, మండల తాసిల్దార్ సుబ్రహ్మణ్యం రెడ్డి, మండల ఎంపీడీవో రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు

## కార్మిక సిబ్బందికి జీతాలు చెల్లించడంలో నిరక్ష్యం

చెవిలో పూలతో వినూత్న నిరసన

వేంపల్లె:సెప్టెంబర్ 20:(ప్రభాత వార్త)



కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పారిశుద్ధ్య సిబ్బంది

స్థానిక పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య, వివిధ కార్మిక సిబ్బందికి జీతాలు చెల్లించడంలో నిరక్ష్యం వహిస్తున్నట్లు ఏఐటియూసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కెసి.బాదుల్లా మండిపడ్డారు. శనివారం కార్యాలయం ఎదుట చెవిలో పూలతో వినూత్న నిరసన తెలిపారు. గత ఐదు నెలలుగా వేతనాలు అందక పోవడంతో పండగ పూట పస్తుండాల్సిందేనా? అంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పదిరోజుల నుంచి అవిగో ఇవిగో వేస్తామంటూ స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్ ప్రచార ఆర్భాటాలపై ఉన్న శ్రద్ధ వేతనాలు చెల్లించడంలో ఎందుకు లేదని నిలదీశారు. వీరి కుటుంబాల జీవనం ఎలా గడవాలని ఆవేదన వెలిబుచ్చారు. అంతేకాకుండా గత 15 నెలల పిఎఫ్ డబ్బులు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. మరో తురుకపాళెం చేయొద్దని, వెంటనే కార్మిక సిబ్బందికి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసి నాయకులు సునీల్, మల్లేష్, బాలాజీ, పంచాయతీ కార్మిక యూనియన్ నాయకులు ప్రకాశం, బాబు, కిషోర్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

## 187 చెరువులకు సంవృద్ధిగా క్రిష్ణాజలాలు

మదనపల్లె, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త :



హంద్రీ-నీవా కాలువ ద్వారా కుప్పం బ్రాంచ్ కెనాల్, పుంగనూర్ బ్రాంచ్ కెనాల్స్ నుండి 187చెరువులకు క్రిష్ణా జలాలు సంవృద్ధిగా నింపడం జరుగుతుందని హెచ్ఎన్ఎస్ ఎస్ఈ విఠల్ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా 110చెరువులు, పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ద్వారా 77చెరువులకు క్రిష్ణాజలాలు నింపడం జరుగుతుందన్నారు. ఇప్పటికే కుప్పం నియోజకవర్గంలో 15చెరువుల వరకు క్రిష్ణా జలాలు నింపడం జరిగిందన్నారు. హంద్రీ-నీవా కాలువకు ఎక్కడైనా గండి కొడితే సంబంధిత వారిని గుర్తించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందతన్నారు. హంద్రీ-నీవా కాలువ నీళ్ళ కోసం ఎవరూ తాపత్రాయం పడాల్సిన అవసరం లేదని ప్రతి చెరువుకు క్రిష్ణాజలాలు నింపడం జరుగుతుందన్నారు. కుప్పంతో పాటు పలమనేరు, పుంగనూరు, మదనపల్లె, తంబళ్ళపల్లె నియోజకవర్గాల్లోని ప్రతి చెరువుకు నీరు అందించడం జరుగుతుందన్నారు. కొన్నిచోట్ల హంద్రీ-నీవా కాలువకు గండి కొడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని వారిపై సంబంధిత పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదులు చేయడం జరుగుతుందతన్నారు. చెర్లోపల్లి రిజర్వాయర్లో 1.4టిఎంసి నీరు రిజర్వ్ చేయడం జరిగిందని ప్రతి చెరువకు హంద్రీ-నీవా కాలువ ద్వారా నీరు నింపేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొందన్నారు. రైతులు సహకరించాలని కోరారు. కాలువకు లైనింగ్ పనులు చేయడం వల్ల నీరు వేగంగా వస్తున్నాయన్నారు. కుప్పం నియోజకవర్గంలోని చెరువులు పూర్తి అయిన తరువాత అటునుంచి ప్రతి చెరువు నింపడం జరుగుతుందన్నారు.

## ముందస్తు దసరా సంబరాలు

బద్వేలు అర్బన్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త



బద్వేల్ స్థానిక తెలుగుగంగ కాలనీలో ఉండే నారాయణ ఒలంపియాడ్ స్కూల్ నందు ముందస్తు దసరా మహోత్సవ సంబరాలు అంబరాన్ని తాకాయి. విద్యార్థులు సంస్కృతి సంప్రదాయాలు ఉట్టి పడేలా చక్కని వస్త్రధారణతో అందంగా ముస్తాబయ్యారు. మామిడి తోరణాలతో, రంగవల్లులతో పాఠశాల ప్రాంగణము అందంగా అలంకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాఠశాల ఏజీఎం శ్రీనివాసులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించి చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ దసరా పండుగ జరుపుకుంటారని తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ కిషోర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ దసరా పండుగ యొక్క గొప్పదనాన్ని తెలియజేశారు. విద్యార్థులు అమ్మవారి వివిధ రూపాలకు చక్కని వేషధారణ మరియు సాంస్కృతిక నృత్యాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ కిషోర్, అకడమిక్ డీన్ శ్రీకాంత్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రఘురామిరెడ్డి, రాజేశ్వరి, శివ భారతి, ఏవో శ్రీనివాసులు, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రక్షణ గోడ నిర్మించండి!..

సుండుపల్లె, సెప్టెంబర్ 20,ప్రభాతవార్త:

మండల పరిధిలోని పత్తివాండ్లపల్లె సమీపంలో ఉన్న తుమ్మాని వంకకు రక్షణ గోడ నిర్మించి పత్తివాండ్లపల్లె ప్రజల ప్రాణాలు కాపాడాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు సుండుపల్లి మండల నివాసి యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి శనివారం ఒక పత్రిక ప్రకటన ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.గత పక్షం రోజుల క్రితం భారీ వర్షాల కారణంగా తుమ్మాని వంకకు వరద నీరు వచ్చి వంకకు రక్షణగా ఉన్న మట్టికట్ట(కరకట్ట)కు గండిపడి లోతట్టుగా ఉన్న పత్తివాండ్ల పల్లె గ్రామంలోని గృహాల్లోకి వరద నీరు చేరి ప్రజలకు ఆస్తినష్టం వాటిల్లిందని, కోళ్ళు వరదలో కొట్టుకు పోయాయని ఆయన తెలిపారు.ఆ రోజు రాత్రి అంతా ప్రజలంతా బిక్కుబిక్కుమని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఉన్నారని ఆయన తెలిపారు. ఇటీవల నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మళ్ళీ గ్రామంలోకి వంకనీరు ప్రవహిస్తుందని ఆయన తెలిపారు. ఈ వరదనీరు వ్యవసాయ భూములు మీద పడి పంటలు కొట్టుకు పోయి రైతులు నష్టపోయారని ఆయన తెలిపారు. బ్రిడ్జి దెబ్బతినడంతో గ్రామ ప్రజలు బయటి ప్రపంచానికి రాకపోకలు లేవని ఆయన తెలిపారు.వంకనీరు వ్యవసాయ భూములు మీద పడి ప్రవహిస్తూ ఉందని ఆయన తెలిపారు.జిల్లా అధికారులు స్పందించి తుమ్మాని వంకలోని కంప చెట్లను తొలగించాలని, వ్యవసాయ భూములు కంటే వంకను లోతు చేయాలని, తుమ్మాని వంకకు రక్షణ గోడ (ప్రొటెక్షన్ వాల్) నిర్మించాలని, రోడ్డు, బ్రిడ్జిలకు మరమ్మతులు వెంటనే చేసి ప్రజల అసౌకర్యం కలగకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## అంతర్జాతీయ స్థాయిలో అదరగొట్టిన పులివెందుల శాస్త్రవేత్త

పులివెందుల, సెప్టెంబరు 20 , ప్రభాత వార్త:



అంతర్జాతీయ స్థాయిలో పులివెందు లకు చెందిన జువాలజీ శాస్త్రవేత్త అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉదయ్ కిరణ్ పరిశోధనలో ప్రతిభ కనబరచి ద్వితీయ స్థానం సాధించి పులివెందుల పేరుకు జిల్లా పేరుకు గుర్తింపు తెచ్చారు. బెంగళూరులోని రేవా యూనివర్సిటీలో సెప్టెంబర్ 17 నుండి 19, 2025 వరకు నిర్వహిం చిన రెన్సర్ 11వ అంతర్జాతీయ సదస్సు లో ఆసియా ఖండానికి చెందిన 9 దేశాల నుండి శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ సదస్సులో దాదాపు 200 పరిశోధనా పత్రాల ప్రదర్శన జరిగింది.ఈ సందర్భంలో లైఫ్ సైన్స్ విభాగంఅధ్యాపక వర్గం కేటగిరీలో వైఎస్సార్ కడప జిల్లా, పులివెందు లలోని లయోలా డిగ్రీ కళాశాలకు చెందిన జువాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. వి. ఉదయ్ కిరణ్ ద్వితీయ బహుమతి అందుకు న్నారు.ఈ అవార్డును మలేషియా కెల్టెన్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొ. డాటో డాక్టర్ ఇబ్రహీం చె ఒమర్ మరియు ఫిలిప్పీన్స్ కి చెందిన ఓ ఎస్బి, సాన్ బేడా యూనివర్సిటీ ప్రొఫెసర్ అలోయ్షి యస్ మా. ఎ. మారనన్ ల చేతుల మీదుగా అందుకున్నారు. డా. వి. ఉదయ్ కిరణ్ సాధించిన ప్రతిష్టా త్మక విజయంపై కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ జోజి రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ వన చిన్నప్ప , సహచర అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ హృదయ పూర్వక అభినందనలు తెలిపారు.

# మొక్కలను నాటి ప్రకృతిని కాపాడుకుందాం

బద్వేలు,సెప్టెంబరు 20, ప్రభాతవార్త :



ప్రతి ఒక్కరూ మొక్కలను మొక్కలను నాటి ప్రకృతిని కాపాడుకునేందుకు సహకరించాలని బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వెంకటసుబ్బారెడ్డి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కల పెంపకం పై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ సమాజసేవలో భాగంగా తమవంతుగా ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని సూచించారు. తద్వారా కాలుష్యాన్ని దూరం చేయవచ్చని భావితరాల వారికి మనమిచ్చే సంపద మంచి ఆరోగ్యమేనని ఇందుకు మొక్కలు నాటేందుకు ప్రతి ఒక్కరూ సంసిద్ధులు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎ నోడల్ ఆఫీసర్ ఈశ్వరయ్య, సభ్యులు దొరస్వామి నాయక్, మేరిస్వర్ణలత, అధ్యాపకఅధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటరు జాబితాపై సమీక్షా సమావేశం

బద్వేలు, సెప్టెంబర్ 20 (ప్రభాతవార్త):




భారత ఎన్నికల సంఘం న్యూఢిల్లీ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో బద్వేలు, గోపవరం తహశీల్దార్ల సమక్షంలో బిఎల్వలతో సమావేశం నిర్వహించారు. ఈమేరకు ఆర్డీవో చంద్రమోహన్ మాట్లాడుతూ 2002వ సంవత్సరం ఓటర్ల జాబితాలోని ఓటర్ల జాబితాలోని ఓటర్లను 2025 ఓటర్ జాబితాలో ఓటర్లుగా నమోదు అయి ఉన్నారో, లేదో పరిశీలించవసిలనదిగా ఆదేశిస్తూ శిక్షణా కార్యకమం నిర్వహించేచారు. 2025 ఓటరు జాబితాను ఖచ్చితంగా ఓటరు నమోదై ఉన్న వారి వివరములను రెండు రోజుల లోపల పూర్తిచేసి కార్యాలయమునకు సమర్పించేలా చూడాలని బిఎల్ఎలకు సూచించారు.

# సబ్ ట్రెజరీ అధికారికి సన్మానం

బద్వేలు అర్బన్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త



విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఏపీ గవర్నమెంటు రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ బద్వేలు యూనిట్ అధ్యక్షులు శీలం గంగన్న నూతన సబ్ ట్రెజరీ అధికారి సురేష్ఠ్ కు విన్నవించారు. అనంతరం నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ మేరకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని సురేష్ తెలిపారు. సబ్రెజరీ అధికారిని కలిసిన వారిలో వెంకటలక్ష్మమ్మ, ట్రెజరర్ సత్తిబాబు, జాయింట్ సెక్రెటరీ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు వైద్య సేవలపై అవగాహన

దువ్వూరు, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త:



మండల పరిధిలోని పెద్ద జొన్నవరం, చల్లబసాయపల్లె గ్రామాలలో శనివారం మహిళలకు వైద్యశాఖ ద్వారా మహిళలకు అందుతున్న వైద్య సేవల గురించి అవగాహన కలిగించినట్లు డాక్టర్ రోషిని, హేమలతలు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్థనారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం కింద ప్రతి మహిళకు వైద్య సేవలు అందించి ఆరోగ్యవంతంగా ఉండేందుకు కృషి చేస్తున్నామని వీటిని వినియోగించుకోవాలని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన మహిళలు అందరికీ రక్త పరీక్ష, షుగర్, బీపీ తదితర వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. వారికి అవసరమైన మందులను కూడా పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజగోపాల్, విజయకుమారి, శాంత కుమారీ తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతమైన స్వచ్ఛనారి స్వశక్తి పరివార్

బ్రహ్మంగారిమఠం సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం విజయవంతమైంది. ఇందులో 242 మంది వివిధ రకాల జబ్బులు గల స్త్రీలు పిల్లలు చికిత్సలు పొందడమైనది.ఈ కార్యక్రమాన్ని మండల టిడిపి అధ్యక్షులు సుబ్బారెడ్డి,సొసైటీ అధ్యక్షులు సాంబశివారెడ్డి మరియు డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ ఓ డాక్టర్ మల్లేష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం డాక్టర్ శశి భూషణ్ రెడ్డి జిల్లా పర్యవేక్షణ అధికారి కార్యక్రమాన్ని పరిశీలించారు.ఇందులో డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ ఓబులేష్,స్పెషలిస్ట్ డాక్టర్లు సుధా గైనకాలజిస్ట్,డాక్టర్ రాజేష్ జనరల్ ఫిజీషియన్,డాక్టర్ పవన్ చిన్నపిల్లల వైద్య నిపుణులు,డాక్టర్ కళాధర్ పంటి వైద్యులు,అనస్థీషియా డాక్టర్ గాయత్రి,డాక్టర్ మహాలక్ష్మి,కంటి వైద్యులు కృష్ణదేవరాయలు,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాంబశివారెడ్డి, హెల్త్ సూపర్వైజర్ ఎస్. పుష్పరాజ్,మలేరియా సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎస్.వెంకటేశ్వర్లు, పలుగురాళ్లపల్లె ఎం.పి.హెచ్ సి.ఓ. ఎం.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోని స్వచ్ఛ ఆంధ్ర సాధ్యం

రాజంపేట, సెప్టెంబర్20 ప్రభాతవార్త

ప్రజల భాగస్వామ్యంతోని ఏ కార్యక్రమమైనా విజయవంతం అవుతుందని, స్వచ్ఛ ఆంధ్ర కూడా అదే విధంగా సాధ్యం పడుతుందని మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాసులు అన్నారు.రాజంపేటలో స్వచ్ఛ ఆంధ్ర గ్రీన్ డే సందర్భంగా ర్యాలీ రాజంపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ నెల స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా, ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవం గ్రీన్ ఏపీ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం రాజంపేట పురపాలక ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో నిర్వహించారు.ఈ సందర్భంగా, మున్సిపల్ ఆవరణ నుండి ఆర్ అండ్ బి బంగ్లా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మునిసిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, ఎక్సైజ్ డిపార్ట్మెంట్, హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది , ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆర్ అండ్ బి బంగ్లా వద్ద అందరూ మానవహారంగా ఏర్పడి, జి. శ్రీనివాసులు స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పర్యావరణ కాలుష్యాన్ని నివారించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్లాస్టిక్కు ప్రత్యామ్నాయంగా బయోడిగ్రేడబుల్ , జ్యూట్ బ్యాగులు వాడాలని కోరారు. అలాగే, బలిజపల్లి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద గ్రీన్ ఆంధ్రప్రదేశ్ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం ద్వారా ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను ప్రజలకు తెలియజేయడమే కాకుండా, స్వచ్ఛమైన, పచ్చని రాజంపేట నిర్మాణానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మున్సిపల్ కమిషనర్ జి శ్రీనివాసులు, ఎక్సైజ్ సీఐ మల్లికా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కడప, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త

కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో 1985-89లో ఇంజనీరింగ్ పట్టభద్రులైన పూర్వ విద్యార్థుల సమ్మేళనం కెఎస్ఆర్ఎం ఫ్రెండ్స్ అసోసియేషన్ మరియు కాలేజీ యాజమాన్యం ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ , ప్రైవేట్ రంగాలలో మరియు వివిధ దేశాలలో స్థిరపడిన వారు ఈ సమావేశానికి వచ్చి ఎన్నో మధురానుభూతులు పంచుకుంటూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. తమకు విద్యాబోధన చేసిన గురువులను వారీ సహకారాన్ని స్మరించుకుంటూ ఘనంగా సన్మానం చేసి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని), కాలేజీ కరస్పాండెంట్ కందుల రాజేశ్వర మ్మ. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి ఎన్ ప్రసాద్, అల్యూమిని డీన్ అమర్నాథ్ రెడ్డి, ఫ్రెండ్స్ అసోసియేషన్ !!40 ఆర్గనైజింగ్ కమిటీ శ్రీ సీ.వీ.కృష్ణా రెడ్డి, బాలాజీ, శ్రీకాంత్ , శ్రీనివాస రావు , విద్యా సాగర్ గురు ప్రసాద్ మరియు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# కొయ్య బెంచీలు, స్టూళ్ళు వితరణ

పీలేరు సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:

పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి ఓ దాత రూ.60,000 విలువ చేసే కొయ్య బెంచీలు, స్టూళ్ళు వితరణ చేశారు. శనివారం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడుతూ పీలేరు మండలం, రేగళ్ళు పంచాయితీ, కూరపర్తివారిపల్లికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బద్దం రాజారెడ్డి ఏరియా హాస్పిటల్ కు 10 చెక్క బెంచీలు, 10 చెక్క స్టూళ్ల విరాళంగా ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి మనందరి సంపదగా భావించాలని చెప్పారు. మన ఈ ఆసుపత్రి అవసరాలను గుర్తించి, సౌకర్యాల కల్పనకు దాతలు ముందుకొచ్చి హాస్పిటల్ అభివృద్ధికి దాతలు తమ వంతు సహాయ సహకారాలను అందివ్వడం ఎంతో అవసరమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎం ఓ డాక్టర్ సరస్వతమ్మ, హెడ్ నర్సులు శారద, రాజ్యలక్ష్మి, ఫార్మసిస్ట్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వస్త్ ఆరీ సశక్త్ పరివార్ అభియాన్

జమ్మలమడుగు, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకంలో భాగంగా జమ్మలమడుగు ఏరియా ఆసుపత్రిలో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయకర్త (డీసీహెచ్ఎస్) డా.హిమదేవి మాట్లాడుతూ కార్యక్రమం మహిళలు, పిల్లల ఆరోగ్యంపై దృష్టి పెడుతోందని సాధారణ ఆరోగ్య పరీక్షలు, గైనకాలజికల్ చెకప్, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏరియా ఆసుపత్రిలో సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహించడం జరుగుతుందని కావున గ్రామాలు, మండలంలోని ప్రతి ఒక్క మహిళ, పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి పర్యవేక్షణ అధికారి డా.రఫీక్ పాషా కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయకపోతే ఉద్యమిస్తాం

రాజంపేట, సెప్టెంబర్20 ప్రభాతవార్త



వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయకపోతే ఉద్యమిస్తామని వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్ పేర్కొన్నారు. శనివారం గ్రామ రెవెన్యూ సహాయకుల జిల్లా సమావేశం స్థానిక ఎన్జీవో హోంలో నిర్వహించారు. ఈ జిల్లా సమావేశం జిల్లా అధ్యక్షుడు సుధాకర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. జిల్లా సమావేశానికి వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్, అన్నమయ్య జిల్లా వీఆర్ఏల సం ఘం గౌరవాధ్యక్షులు చంద్రశేఖర్, రాజంపేట సిఐటియు ఉపాధ్యక్షులు రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్న వీఆర్ఏల సమస్య ఏ ఒక్కటి కూడా పరిష్కారం చేయలేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలని , అటెండర్, నైట్ వాచ్మెన్ ప్రమోషన్ శాతాన్ని 70 కు పెంచాలని, అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎన్జీవో హోం నుండి, సబ్ కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీగా వచ్చి ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. సబ్ కలెక్టర్ భావన కి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు.

# సత్తా చాటిన జూనియర్ కళాశాల విద్యార్థులు

పెండ్లిమర్రి, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:

2025 సంవత్సరానికి జిల్లా స్థాయి ఎస్జీఎఫ్ స్కూలు ఫెడరేషన్ గేమ్స్లో కలరీ పయట్టు, గట్కా అనే క్రీడల్లో అండర్-19, అండర్-17 విభాగాల్లో పెండ్లిమర్రి జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు సత్తా చాటారని కళాశాల ప్రిన్సిపల్ ఇందిర పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు జేసీఎస్ కలరీ అకాడమీ మాస్టరు జయచంద్ర ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఢిల్లీకి వెళ్లడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు, వారి తల్లిదండ్రులు ప్రోత్సహించిన ప్రిన్సిపల్ ఇందిరకు కృతజ్ఞతలు తెలిపారు.

# సామాజిక మాధ్యమాలలో వచ్చిన ఆరోపణలు నిజమే

ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త :



సామాజిక మాధ్యమాలలో ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన పలువురిపై వచ్చిన ఆరోపణలు నిజమేనని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు సుధాకర్ మాదిగ తెలిపారు. శనివారం స్థానిక కొర్రపాడు రోడ్డు లోని ఆయన కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణానికి చెందిన పలువురు ప్రముఖ వ్యక్తులు అక్రమంగా ధనార్జన చేస్తున్నారని, ప్రొద్దుటూరు తాత్కాలిక కూరగాయల మార్కెట్ వద్ద కూడా వారిలో ఒకరు తోపుడు బండ్ల వ్యాపారులకు కూడా నోటీసులు ఇప్పించారని గుర్తు చేశారు. ఇటువంటి వ్యక్తులను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఆయన తనయుడు కొండారెడ్డి ఎంత దూరం వుంచితే వారికి అంత మేలని లేకపోతే వారికే నష్టం వస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళిక తో ముందుకు సాగితే అద్భుతాలు సాధించవచ్చు

బద్వేలు అర్బన్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త




యువత ప్రణాళిక తో ముందుకు సాగితే జీవితంలో ఎన్నో అద్భుతాలు సాధించవచ్చని హైదరాబాద్ రక్షణ ఐ.ఏ.ఎస్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ యం.మమత అన్నారు. నేడు శ్రీ రాచపూడి నాగభూషణం డిగ్రీ పీజీ (అటానమస్) కళాశాల,బద్వేల్ లో వ్యక్తిత్వ వికాసం పట్ల విద్యార్థులతో జరిగిన సమన్వయ సమావేశం లో ఆమె పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే క్రమం లో ఓపిక తో సిద్ధం కావాలని. కేవలం ఒక్కసారి ప్రయత్నించి విఫలం చెందితే ఇక ఉద్యోగాలు రావని వెనకడుగు వేసేవాళ్ళు చాలామంది ఉన్నారని, అలా చేయకుండా చివరి వరకు నమ్మకంతో ప్రయత్నిస్తూ ఉండాలని ఆమె తెలిపారు. విజయం సాధించిన ప్రతి ఒక్కరిని స్ఫూర్తిగా తీసుకొని ప్రభుత్వ ఉద్యోగాలకు సంసిద్ధం కావాలని ఆమె విద్యార్థులకు సలహా ఇచ్చారు. నాగభూషణం కళాశాల విద్యార్థులకు గ్రూప్స్ కోచింగ్ విషయంలో సహాయం చేసేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని భరోసా ఇచ్చారు. కొద్దిపాటి వైఫల్యానికే యువత జీవితం మీద ఆశలు కోల్పోయి బలవన్మరణానికి పాల్పడుతున్నారని, అలా చేయకుండా ఓపికతో, ఆశాభావంతో ముందుకు సాగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పత్రిక ఎడ్యుకేషన్ డెస్క్ ఇంచార్జ్ కె.సురేష్, శ్రీ రాచపూడి నాగభూషణం విద్యాసంస్థల పరిపాలన అధికారి రాచపూడి వెంకట సాయి కృష్ణ, ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాల ఓబులేసు, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిఒక్కరు మొక్కలు నాటాలి

పులివెందుల,సెప్టెంబరు 20 ప్రభాత వార్త:


మొక్కలు నాటుతున్న దృశ్యం

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, స్వచ్ఛ పులివెందుల మనందరి బాధ్యత అని పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలిఅని పులివెందుల మునిసిపల్ కమీషనర్ రాముడు అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆకు పచ్చ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమం నిర్వహించ డం జరిగింది. ఈ కార్యక్రమం లో భాగంగా డ్వామా కార్యా లయం ప్రాంగణంలో దాదాపు 600 మొక్కలు నాటే కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ రాముడు, మునిసిపల్ వైస్ చైర్మన్ హాఫిజ్, రాష్ట్ర హజ్ హౌస్ డైరెక్టర్ మహబూబ్ బాషా, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు లు పాల్గొని మొక్కలు నాటి, నీరు పోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ హాఫిజ్ మాట్లాడుతూ పర్యావరణ సమ తుల్యత, పర్యావరణ సంరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షంచడం అలవరచుకోవాల న్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర హజ్ హౌస్ డైరెక్టర్ మహబూబ్ బాషా మాట్లాడుతూ పరిసరాల పరుశుభ్రత తోనే ప్రతి కుటుంబం ఆరోగ్యం గా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం లో కో ఆప్షన్ మెంబెర్ చంద్రమోళి, కౌన్సిలర్ లు ఖాదర్, రాజ శేఖర్ రెడ్డి డ్వామా సిబ్బంది, మునిసిపల్ డి ఈ లు, శానిటరీ ఇన్ స్పెక్టర్ లు సిబ్బంది, సీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వెనుకబడ్డ విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ చూపాలి

చిట్వేలి,సెప్టెంబర్ 20, ప్రభాతవార్త:



చదువులో వెనకబడ్డ విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ కోదండ నాయుడు అన్నారు. ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే క్లస్టర్ సమావేశాన్ని ఎంఈఓ అధ్యక్షతన, క్లస్టర్ హెచ్ఎం దుర్గారాజు ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ వెనుకబడ్డ విద్యార్థులకు ఎఫ్ ఏ వన్ పరీక్షల్లో వచ్చిన ఫలితాల ఆధారంగా సి మరియు డి గ్రేడ్ పిల్లలగా గుర్తించాలన్నారు. వారి వెనుకబాటుకు కారణాలతో పాటు, ఏ ఏ అంశాలలో వెనుకబడి ఉన్నారన్నది ఉపాధ్యాయులు గుర్తించాలన్నారు. వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఏ బి గ్రేడ్లకు చేర్చేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. క్లస్టర్ హె చ్ఎం దుర్గరాజు మాట్లాడుతూ కస్టర్ సమావేశంలో చర్చించిన అంశాలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ చూచనలను తప్పకుండా పాటించాలన్నారు. తదుపరి సీనియర్ ఉపాధ్యాయులు కామాటం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ ఖచ్చితంగా సమయపాలన పాటించాలని, ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి అందిస్తున్న కార్యక్రమాలను ప్రతి విద్యార్థికి చేకూరేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు.తదుపరి అకడమిక్ క్యాలెండర్ ను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, సోఫియా, బాలసుబ్రమణ్యం, సతీష్, సీఆర్పి చంద్రశేఖర్ మరియు 19 పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నిర్మాణ పనులుకు నిధులివ్వని ప్రభుత్వం

పులివెందుల సెప్టెంబరు 20, ప్రభాత వార్త:



నియోజక వర్గంలో నిర్మాణంలో ఉన్న పనులకు ఒక్క రూపాయి కూడా టీడీపీ ప్రభుత్వం మంజూరు చేయలేదు అని వైసీపీ నాయకులు అంబకపల్లి నారాయణ స్వామి, కో ఆప్షన్ మెంబర్ చంద్రమోళి లు అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ సిటీమాల్కు కూటమి ప్రభుత్వం వచ్చి 18 నెలలు గడుస్తున్నా కూడా ఒక్క ఇటుకకు నిధులు ఇవ్వని ప్రభుత్వంలో పులివెందుల టీడీపీ నాయకులు ఉండటం సిగ్గుచేటు అన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజీనామా గురించి కాకుండా,పులివెందుల నడిబొడ్డున శ్రీ వేంకటేశ్వర స్వామి సాక్షిగా టీడీపీ అధికారం లోకి వస్తే పాడా ను కొనసాగిస్తామని చెప్పి ఇప్పుడు మాట తప్పిన చంద్రబాబును రాజీనామా చేయమని పులివెందుల టీడీపీ నాయకులు ఒత్తిడి చేస్తే బాగుంటుందన్నారు. పులి వెందుల ప్రాంతం తిరిగి అభివృద్ధి చెందాలంటే మళ్లీ జగన్ మోహన్ రెడ్డి సీఎం అయితే తప్ప ఈ చంద్రబాబు ప్రభుత్వంలో పులివెందుల అభివృద్ధి సాధ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ బీసీ విభాగం కన్వీనర్ కార్తీక్, సోషియల్ మీడియా కన్వీనర్ జహీర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ ఆంధ్ర, స్వచ్ఛతా సేవా ర్యాలీ

కలికిరి, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:



కలికిరి మండలంలో కలికిరి గ్రామ సచివాలయం కార్యదర్శి అశోక్ ఆధ్వర్యంలో ఎంపీడీవో భానుమూర్తిరావు, డిప్యూటీ ఎంపీడీవో మహ్మద్ రియాజుద్దీన్ పర్యవేక్షణలో గ్రీన్ ఆంధ్ర, స్వచ్ఛతా ఈ సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కలికిరి గ్రామ పంచాయతీ నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు విద్యార్థిని విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు నినాదాలతో పచ్చదనమే ప్రగతి, స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ జీవితం, హరితాంధ్ర మన లక్ష్యం, స్వచ్ఛ ఆంధ్ర ఆరోగ్య ఆంధ్ర తదితర నినాదాలతో ర్యాలీగా వెళ్లి మానవ హారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కలికిరి మండలంలో మండల పరిషత్ అడ్మినిస్ట్రేటీవ్ అధికారి సురేంద్రబాబు, మండల రీసోర్స్ కోఆర్డినేటర్ శంకర్, కార్యదర్శి అశోక్, హెడ్ మాస్టర్ జయమ్మ, గ్రామ పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రెడ్డివారి యోగేష్రెడ్డి, సచివాలయం సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల కాలనీలు ఏర్పాట చేయాలి

బద్వేలు అర్బన్,సెప్టెంబరు 20, ప్రభాతవార్త :

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దివ్యాంగులందరికీ ఇంటి పట్టాలు ఇవ్వడతో పాటు వారికి ప్రత్యేక కాలనీలు ఏర్పాటు చేయాలని దివ్యాంగుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఇండ్ల ఓబులేసు అన్నారు. శనివార స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ గృహాల పథకం కింద ఇంటి పట్టాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు దివ్యాంగుల పెన్షన్లు తొలగింపు చేయడం ప్రభుత్వాని తగదని సూచించారు. వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు బస్సు ప్రయాణ సౌకర్యాలు ఉచితంగా కల్పించాలని తదితర డిమాండ్లు చేశారు.ఈ కార్యక్రమంలో చింతకుంట రఫీ, సీపీఐ పట్టణ కార్యదర్శి బాల ఓబయ్య తదిరులు పాల్గొన్నారు.

# శ్రీ వారికి ప్రత్యేక పూజలు

బద్వేలు అర్బన్ ,సెప్టెంబరు 20 , ప్రభాతవార్త :



పట్టణంలోని సిద్దవటం రోడ్డులో వెలసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వరస్వామి, అభయాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం ఆలయ పూజారి వీరేశాచార్యులు ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పూజ కార్యక్రమాలతో పాటు స్వామికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పలు రకాల విశేష పూజలు నిర్వహించారు.శనివారం నాటి పూజలలో ప్రత్యేక అభిషేక దాతలుగా చంద్రమోహన్ సతీమణి సుబాషిని, పబ్బుతి చంద్రశేఖర్,సతీమణి వసంతలక్ష్మి,పెద్ది వెంకట సుధాకర్ సతీమణి వసంతలక్ష్మి, శ్రీనివాసులు సతీమణి రాజేశ్వరి, సుధాకర్రెడ్డి సతీమణి శర్వాణిరెడ్డి,నాగేంద్రరెడ్డి సతీమణి ఉమామహేశ్వరి, రామబోయిన పుల్లయ్య, సతీమణి కృష్ణమ్మ, లక్ష్మీనారాయణరెడ్డిసతీమణి స్వర్ణలత కుటుంబసభ్యులతో పాటు ప్రత్యేక ఉభయదాతలుగా అంకయ్య సతీమణి రుక్మిణమ్మ, మస్తాన్రాజా, సతీమణి వసంతలక్ష్మి కుటుంబ సభ్యులకు స్వామివారి సన్నిధిలో విశేష పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వీరికి ఆలయ నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందించారు. కోరిన కోర్కెలు తీర్చే వెంకటేశ్వర స్వామి వారిని పలువురు భక్తులు, భక్తి, శ్రద్దలతో స్వామివారినిదర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆలయనిర్వాహకులు వి.వి.రమణ పలువురు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



# 16 ఎర్రచందనం దుంగలు

ప్రొద్దుటూరు క్రైం, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు-జమ్మలమడుగు మార్గంలో తనిఖీలు నిర్వహించిన టాస్క్ఫోర్స్ పోలీసులకు 16 ఎర్రచందనం దుంగలు, 2 కార్లు, గొడ్డళ్లు, బరిసలు, రంపపు చుట్ట పట్టుబడ్డాయి. 18 మంది స్మగ్లర్లను అరెస్టు చేశారు. టాస్క్ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు ప్రత్యేక కార్యాచరణలో భాగంగా టాస్క్ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ ఎండీ షరీఫ్ మార్గ నిర్దేశకత్వంలో కడప సబ్ కంట్రోల్కు చెందిన ఆర్ఎస్ఐ మురళీధర్రెడ్డి టీం వాహనాలు తనిఖీ చేశారు. పెద్దశెట్టిపల్లి వద్ద 2 కార్లు వేగంగా వస్తూ కనిపించాయి. తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి వాహనాలు ఆపి, కార్లు దిగి పారిపోసాగారు. అప్రమత్తమైన టాస్క్ఫోర్స్ పోలీసులు వారి వెంట పడి 18 మందిని పట్టుకున్నారు. కార్లు తనిఖీ చేయగా అందులో 16 ఎర్రచందనం దుంగలు, 4 పిడిలేని గొడ్డళ్లు, 4 పిడిలేని బరిసలు, రంపపు చుట్ట కలిగి ఉన్నాయి. పట్టుబడిన వారు తమిళనాడుకు చెందిన వారిగా గుర్తించారు. వారిని ఎర్రచందనం దుంగలు సహా స్వాధీనం చేసిన వస్తువులతో తిరుపతి టాస్క్ఫోర్స్ పోలీసు స్టేషన్కు తరలించారు. వారిని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఏసీఎఫ్ శ్రీనివాస్ విచారించారు. ఎస్సై రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



**పేరు మార్పు**

పసుపులేటి శిరీష వైఫ్ఆఫ్ పటం శ్రీనివాసులు, డోర్ నెంబర్ 2/780-1-3, నాగరాజు పేట, కడప వైయస్సార్ జిల్లా, ఏపీ. (పాత పేరు) పి లక్ష్మీ షణ్ముక్, కొత్త పేరు. పటం లక్ష్మీ షణ్ముఖ, తండ్రి పేరు. పి శ్రీనివాసులు (పాత పేరు), పటం శ్రీనివాసులు కొత్త పేరు,తల్లి పేరు పి.శిరీష,(పాత పేరు), పసుపులేటి శిరీష కొత్త పేరులుగా మార్చడం అయినది.

**CHANGE OF NAME**

I,**SHAIK AFSAR** (Old Name) D/o **SHAIK SADAQ**,resident of H.No.24/53,Power House Road, Proddatur Town and Mandal, YSR Kadapa District, AP,Pin-516360 hereby declare that I have changed my name as **SYED AFSAR** (New Name) W/o **SYED MOHAMMED HASHIM** for all future purposes.

**CHANGE OF NAME**

I,**NANDYALAMPETA ALLAKBAR** (Old Name) S/o **NANDYALAMPETA KHADAR BASHA**,resident of H.No.23/329, Modampalli Street,Proddatur Town and mandal,YSR Kadapa District, AP,Pin-516360 hereby declare that I have changed my name as **NANDYALAMPETA ALI AKBAR** (New Name) for all future purposes.

**CHANGE OF NAME**

I SHAIK MASTHANAMMA, W/o Shaik Ayyappa, Resident of Krishnapuran (V), Budawada (Panchayathi), Marripadi (M), Nellore - 524312, A.P. Hereby Declare that I have changed My Spouse Name as SHAIK AYYAPPA ( New name), SHAIK ABDUL (Old Name).

**మదనపల్లె పురపాలక సంఘము**

ఆర్.ఓ.సి.నెం.1146/A1/2011 తేది: 20.09.2025

**బహిరంగ వేలము ప్రకటన**

మదనపల్లె పురపాలక సంఘమునకు చెందిన వివిధ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలోని దిగువ మరియు మొదటి అంతస్తు నందుగల షాపు రూములను 3 సం॥ కాలము బాడుగకు ఇచ్చుటకు గాను ది: 29.09.2025వ తేది సాయంత్రం గం॥ 4:00 లకు కమీషనరు గారిచే కాని లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలము 3వసారి/3వ పిలుపు నిర్వహించబడును.

| వ. నెం. | ఏరియా/ కాంప్లెక్స్ | మొత్తం | ఖాళీగా ఉన్న షాపురూముల నెంబర్లు (3వ సారి) |
|---|---|---|---|
| 1 | జీ.కే.వీధి | 11 | 27,27A,28A,29,29A,30,33(SC),33A (SC),34,35,39 |
| 2. | ముగ్గురాళ్ళ వంక | 12 | 30,31,32,34,37,38,44,45,51,53,63,64 |
| 3. | చిత్తూరు బస్టాండు | 19 | 8(ST),9(PH),10,11,15,16(SC),17,18,19, 20,22 (SC),24,26,27(SC),28,29, 30,33(PH), Toilet rooms |
| 4. | బెంగుళూరు బస్టాండు | 04 | 35A, 36A,38A,40(SC) |
| 5. | కో-ఆప్ కాలనీ | 06 | 5,06,08,09(ST),10,11(SC) |
| 6. | సుబాష్ రోడ్డు | 01 | 1 |
| 7. | కొత్తగా నిర్మించిన చిత్తూరు బస్టాండ్ | 01 | 03 |
| 8. | ఆంధ్ర కేసరి విపణి కల్ప | 01 | 08 (Hotel) |
| 9. | టౌన్ హాల్ | | |
| మొత్తం | | 55 | |

ఆంధ్ర కేసరి విపణి కల్ప కాంప్లెక్స్‌లోని హోటల్ రూము నెం: 08 సాల్వెన్సీ రూ.10,00,000/-లు, గ్రౌండ్ ఫ్లోర్ నందు వున్న షాపు రూములకు రూ1,00,000/-లతో, మొదటి అంతస్తు నందు వున్న షాపు రూములకు రూ50,000/-లతో సాల్వెన్సీ సర్టిఫికెట్ లేదా తత్సమానమైన పైకముతో కమీషనరు పేరిట డి.డి పాట కాలమందు చెల్లించవలెను. మరియు బహిరంగ వేలము డిపాజిట్ క్రింద ఆంధ్ర కేసరి విపణి కల్ప కాంప్లెక్స్ లోని హోటల్ రూము నెం: 08నకు రూ 5,00,000/- లు గ్రౌండ్ ఫ్లోర్ నందు వున్న షాపు రూములకు రూ 50,000/- లు మరియు మొదటి అంతస్తు నందు వున్న షాపు రూములకు రూ 25,000/-లను పాట కాలమందు చెల్లించవలెను.
ఇతర వివరములను కార్యాలయ పని దినములలో రెవెన్యూ విభాగము నందు అడిగి తెలుసుకొనవలెను.

కమిషనరు
మదనపల్లె పురపాలక సంఘము

# వైయస్ జగన్‌ను సీఎం చేసేంతవరకు పోరాడుతాం

**వైయస్సార్ ఎస్సీ సెల్ అధ్యక్ష కార్యదర్శులు సుధాకర్, హరి**

**పీలేరు సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:**

రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పరిపాలనపై ప్రజలు ఇప్పటికే విసుగుచెందారని, గడిచిన 18 నెలల్లోనే తెలుగుదేశం పార్టీపై నమ్మకం కోల్పోయి విసుకు చెందుతున్నారని రాష్ట్ర వైకాపా ఎస్సీ సెల్ అధ్యక్షులు సుధాకర్ బాబు, ప్రధాన కార్యదర్శి వడ్డేహరీలు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా అధ్యక్షుడు ఆకిపాటి అమర్నాథ్ రెడ్డితో చర్చించామని ముఖ్యంగా దళితులను పార్టీలో చులకనగా చూచుటమే కాకుండా అవమానాలకు గురి చేయడమే కాకుండా కేసులతో ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా వైకాపా విజయ డంకా మోగించడం ఖాయమని ఇప్పటికైనా ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు ఎంపీలు ప్రజలపై నమ్మకాన్ని కోల్పోకుండా ఉన్న కొద్ది రోజులైనా పరిపాలన సవ్యంగా చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు సుధాకర్ బాబు ప్రధాన కార్యదర్శి ఎస్.టి.డి. హరి శనివారం అన్నమయ్య జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆకే పార్టీ అమర్నాథ్ రెడ్డి ఎస్టేట్ నందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు సుధాకర్ బాబును కలిసిన కలికిరి మండల నాయకులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శి వి హరి ,విద్యార్థి విభాగ జిల్లా ఉపాధ్యక్షులు మాలతోటి నరేష్, జిల్లా క్రిస్టియన్ విభాగ సభ్యుడు శ్యాముల్ ,రామకృష్ణ విజయ్, సుధాకర్ బాబును కలిసినారు. రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు సుధాకర్ బాబు మాట్లాడుతూ మాలల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కష్టపడి పని చేసి తిరిగి జగన్మోహన్ రెడ్డి గారిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ విభాగ నాయకులకు పిలుపునిచ్చారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే ఎస్సీ ,ఎస్టీ, బీసీ మైనార్టీలకు సమచిత స్థానం ఉంటుందని కాబట్టి మనమందరము కలిసి జగన్మోహన్ రెడ్డి ని ముఖ్యమంత్రిగా తిరిగి చేసుకోవాలని కోరడం జరిగింది .దళితులు అంటే పట్టని చంద్రబాబు నాయుడుకి దళితులే 2029లో బుద్ధి చెప్పి చంద్రబాబు నాయుడుని గద్య దింపుతారని తెలియజేసినారు.



మాట్లాడుతున్న సుధాకర్ బాబు హరి తదితరులు

## ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఐచర్

**ముద్దనూరు. సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:**



మండలంలోని మంగపట్నం టోల్ గేట్ సమీపమున శనివారం కళ్యాణ్ దుర్గం నుంచి నాయుడుపేటకు వైపు లోడు తీసుకెళ్తూ టోల్ గేట్ సమీపాన ఆగి ఉన్న లారీని బళ్లారి నుంచి తిరుపతికి వెళుతున్న ఐచర్ వాహనం ప్రమాదవశాత్తు వెనుక వైపు ఢీకొనడంతో ఐరన్ పైపుల్ లోడులో ఉన్న లారీ ఓనర్ జనార్ధన్ గాయాలు అయినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని తాడిపత్రి ప్రభుత్వఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

## స్వర్ణాంధ్ర స్వచ్ఛందపై అవగాహన ర్యాలీ

**ముద్దనూరు.సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర కార్యక్రమంపై శనివారం నాడు స్థానిక మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించి, స్థానిక నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ చేపట్టి, పాత బస్టాండ్ ఆవరణలో మానవహారంగా నిలబడి స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమం పై ప్రతిజ్ఞ నిర్వహించారు. ఎంపీడీవో రాధాకృష్ణ వేణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడి అడవులను సంరక్షించి, ప్రతి ఒక్కరూ ఒక మొక్క పెంచాలని, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రుడు, ఏపీఎం అపర్ణ, ఏపీఓ గంగయ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్లు విశాలాక్షి, లక్ష్మీదేవి, గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మీనరసింహులు, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

## గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలి

**లక్కిరెడ్డిపల్లి; సెప్టెంబర్ 20,ప్రభాతవార్త**



పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ పెళ్లి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కుర్నూతల పంచాయతీలోని వేల్పు చర్లవాళ్ల పల్లి కుర్నూతల గ్రామాలలో పశుగణాభివృద్ధి సంస్థ కడప వారి ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భకోశ వ్యాధులు చికిత్స శిబిరంలో గుణశేఖర్ పెళ్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో సరైన పోషణ శులు కట్టించటం చూడి పరీక్షలు చేయించుకోవాలన్నారు. గాలుకుంటు వ్యాధి వల్ల పాడిపశువుల్లో చూడికట్టే సామర్థం తగ్గిపోతుందని దూడలు చనిపోతాయని పాల దిగబడి పూర్తిగా తగ్గిపోతుందన్నారు. నాలుగు మాసాలు పైబడిన పశువులకు గాలికుంటు టీకాలు కచ్చితంగా వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పశువర్ధక శాఖ అధికారి డాక్టర్ మాలకొండయ్య పశువైద్యాధికారిలు మహేష్, శివరాం రెడ్డి, శశికళ పశుగణాంక సహాయ అధికారులు ప్రసన్న కుమార్ రెడ్డి రేఖ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 22 నుండి దసరా సెలవులు

**ఎడ్యుకేషన్ సెప్టెంబర్ 20 ప్రభాతవార్త :**

వై.ఎస్.ఆర్ కడప జిల్లాలోని, అన్ని గవర్నమెంట్, మునిసిపల్, జిల్లాపరిషద్, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యముల సెలవు దినాల ప్రకటన దసర సెలవులూ అనగా 22.09.2025 నుండి 02.10.2025 వరకు పిల్లలకి ఎటువంటి ప్రైవేటు క్లాసులు గాని మరియు ఎలాంటి తరగతులు గానీ నిర్వహించకూడదు. ఉత్తర్వులు ఉల్లంగించ్చిన అట్టి యాజమాన్యాలపై తగు చర్యలు తీసుకోనబడునని జిల్లా విద్యాశాఖాధికారి, వై. ఎస్. ఆర్. కడప, జిల్లా షంషుద్దీన్ తెలియజేశారు.

## ఫీ రీయింబర్స్మెంట్ పై చర్చించాలని ఎమ్మెల్సీకి వినతి

**ఎడ్యుకేషన్ సెప్టెంబర్ 20 ప్రభాతవార్త :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా మరియు రాయలసీమ వ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్, డిగ్రీ, మెడిసిన్, లా, నర్సింగ్, బిఈడి,పీజీ మరియు ఇతర కాలేజీలకు సంబంధించిన ఫీజు రియంబర్స్మెంట్‌పై శాసనమండలి సభలో చర్చించాలని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. 6400 కోట్లు నిధులు విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఈ బకాయిల విషయంలో ఈనెల 22వ తారీకు నుండి అన్ని డిగ్రీ కాలేజీలు విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించకుండా బందుకు పిలుపునివ్వడం జరిగిందని దీనికి విద్యార్థి యువజన సంఘాలుగా మేము కూడా స్వచ్ఛంద మద్దతు ఇస్తామని ప్రభుత్వంతో చర్చలు జరిపి అసెంబ్లీ సమావేశాలలో మండలి సమావేశాలలో ఎమ్మెల్సీ వాయిస్ ద్వారా ప్రభుత్వ పాలకుల దృష్టికి తీసుకెళ్లాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థుల బకాయిలు విడుదలకు ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్లు విడుదలకు గతంలో కేటాయించిన బడ్జెట్ను వెంటనే విడుదల చేయాలని ఈ విషయాలపై మండలిలో ప్రవేశపెట్టి తమరు విద్యార్థుల తరఫున మాట్లాడాలని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డినీ కలిసి ప్రగతిశీల విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర కమిటీ కన్వీనర్ ఓబులేసు కత్తి, జిల్లా కమిటీ నాయకులు బయన్నల ఆధ్వర్యంలో కలిసి ఫీజు రీఎంబర్స్మెంట్‌కు సంబంధించిన బకాయిలకు విడుదలకు కృషి చేయాలని కోరారు.



## నలుగురు కోడి పందేల రాయుళ్లు అరెస్ట్

**సిద్ధవటం సెప్టెంబర్ 20 ప్రభాతవార్త**

మండలంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతీ మిట్టపల్లి గ్రామ సమీపాన రైల్వే బ్రిడ్జి వద్ద కోడి పందేళ్లు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు సిద్ధవటం మండల ఎస్సై మహమ్మద్ రఫీ తెలిపారు స్థానిక పోలీస్ స్టేషన్లో శనివారం ఆయన మాట్లాడుతూ తనకు రాబడిన సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం పెద్దపల్లి గ్రామపంచాయతీ లోని మిట్టపల్లి గ్రామ సమీపంలో రైల్వే బ్రిడ్జి వద్ద కోడి పందేళ్లు ఆడుతుండడంతో తమ సిబ్బందితో వెళ్లి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి 10,500 రూ, నగదు రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకొని ఈ మేరకు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశామని మండల ఎస్సై మహమ్మద్ రఫీ పేర్కొన్నారు. మట్కా, జూదం, కోడి పందేలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తే కఠినమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛహి సేవ కార్యక్రమం

**ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:**




స్థానిక ప్రొద్దుటూరులోని రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ హి సేవ 2025 కార్యక్రమంలో భాగంగా శనివారం కళాశాల ప్రాంగణాన్ని శుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ తరుణ్ ఇంద్ర శేఖర్, ప్రిన్సిపల్ తమటం చంద్రశేఖర్ రెడ్డి, ఇన్చార్జ్ ప్రిన్సిపల్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వెంకటేశ్వర రెడ్డి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ విద్యార్థులు అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదం, ముగ్గురికి గాయాలు

**సిద్ధవటం సెప్టెంబర్ 20ప్రభాతవార్త**



మండలం కడప చెన్నై జాతీయ రహదారి భాకరాపేట చెక్ పోస్ట్ సమీపాన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు తగిలాయి. కడప చెన్నై జాతీయ రహదారి భాకరాపేట చెక్ పోస్ట్ సమీపాన ఈ ప్రమాదం జరిగింది. రాజంపేట నుండి ద్విచక్ర వాహనంలో ముగ్గురు యువకులు కడపకు సెకండ్ హ్యాండ్ ద్విచక్ర వాహనాలు కొనుగోలు కోసం వెళ్లి తిరిగి రాజంపేటకు వెళ్తుండగా ఈ ఘటన జరిగినట్లు 108 సిబ్బంది తెలిపారు ఘటనా స్థలానికి హైవే పెట్రోలింగ్ పోలీసులు స్థానిక మండల ఎస్సై మహమ్మద్ రఫీ విచారిస్తున్నారు

## గురజాడ జయంతి వేడుక అధికారికంగా జరపాలి

**సిద్ధవటం సెప్టెంబర్ 20 ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం గురజాడ జయంతిని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 21న అధికారికంగా నిర్వహించాలి. ఈ సందర్భంగా గురజాడ భావాలకు అనుగుణంగా రచనలు చేసే తెలుగు రచయితలను, గురజాడ సాహిత్యం అధ్యయనం చేస్తున్న వారిని ఏడాదికి ఒకరిని పురస్కారంతో గౌరవించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్ బాష తెలిపారు. శనివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 11వ పట్నాల లో ముందస్తుగా గురజాడ అప్పారావు జయంతిని జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమీర్ బాష మాట్లాడుతూ కులాల కుమ్ములాటలు, మతాల మారణ హోమాలు, తబ్బిబ్బు రాజకీయాలతో విసిగి స్వాంతన కోరే ప్రతి భారతీయుడ్ని గురజాడ సాహిత్యం ప్రేమగానే పలకరిస్తూనే ఉంటుంది. ఆధునిక తెలుగు సాహిత్య పితామహులలో ఒకరైన గురజాడ అప్పారావు ఇంటిని గొప్ప అధ్యయన కేంద్రంగా రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దాలని సమీర్ బాష తెలియజేశారు. తదుపరి వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యూనస్, రామ సుబ్బారెడ్డి, సిరాజుల్ల రవిశంకర్, పోతులూరయ్య , నరసింహులు, మోలాలి, హేమంత్, మాధవి లత, రాజమ్మ, పరమేశ్వరి ,సుమతి, సుజాత మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## 15ఫైనాన్స్ కింద రూ.1.72కోట్లు మంజూరు

**మదనపల్లె, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త :**



మదనపల్లె రూరల్ మండలంలోని 25 గ్రామ పంచాయితీలకు 15ఫైనాన్స్ కింద రూ.1.72కోట్లు మంజూరు అయినట్లు ఎంపిడిఓ తాజ్‌మస్రూన్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మంజూరైన నిధులతో గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. నిధులు దుర్వినియోగం కాకుండా గ్రామ సెక్రటరీల పర్యవేక్షణలో సర్పంచ్‌లు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా ప్రభుత్వ పథకాలు వేగవంతం చేసి అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాల మంజూరుకు చర్యలు తీసుకొంటామన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేకచర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజా అవసరాల మేరకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచనలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.

## నిమ్మనపల్లిలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

**నిమ్మనపల్లి సెప్టెంబర్ 20 ప్రభాతవార్త**

మండలంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర సాహస కార్యక్రమంలో భాగంగా మూడో శనివారం నిర్వహించవలసిన SASA ఈవారం గ్రీన్ ఆంధ్ర ప్రదేశ్ చెట్లను నాటడం ద్వారా పచ్చదనం విస్తరించుట కార్యక్రమాన్ని అవగాహన కల్పించి ఎంపీడీవో, సచివాలయ పరిధిలో మొక్కలు నాటడం జరిగింది



## రోడ్డు ప్రమాదాలపై చర్యలు తీసుకోండి

**ఆర్టీఓకు బివైఎస్ నాయకులు వినతి**

**మదనపల్లె, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త :**



వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యపై చర్యలు తీసుకోవాలంటూ బహుజన యువసేన ఆధ్వర్యంలో శనివారం ఆర్టీఓకు విన్నవించారు. ఈ సందర్భంగా బివైఎస్ అధ్యక్షులు పునిత్ మాట్లాడుతూ ప్రధానమైన ట్రాక్టర్లు, ఆటో డ్రైవర్లు రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపడం వల్ల ట్రాఫిక్ సమస్యల జఠిలంగా ఉంటోందన్నారు. రాత్రిపూట ట్రాక్టర్లకు ఇండికేటర్లు లేక, రేడియం స్టిక్కర్లు లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మైనర్ పిల్లలు వాహనాలు నడపడం వల్ల కూడా ప్రమాదాలు సంబవిస్తున్నాయన్నారు. ఈ సమస్యలన్నింటిపై అధికారులు దృష్టి సారించి డ్రైవర్లకు అవగాహన కల్పించి ప్రమాదాలను అరికట్టాలన్నారు. ట్రాఫిక్ నియమావళిలను పాటించకపోవడంవల్లే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సేర్ ఆటోలు మరింత వేగంగా నడపడం, మోతాదుకు మించి ప్రయాణీకులను ఎక్కించుకోవడం వల్ల కూడా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సంబంధిత రవాణాశాఖ అధికారులు రోడ్లపై వాహనాల తనిఖీలు నిర్వహించి ప్రమాదాల నివారణకు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిలానిబాషా, హరిక్రిష్ణ, శ్రీనివాసులు, వినయ్‌కుమార్, సాయికిరణ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైకాపా విమర్శలు

**పార్లమెంటరీ నేత ఆర్‌జె.వెంకటేష్**

**మదనపల్లె, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త :**



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేకనే వైసిపి నాయకులు విమర్శలు చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్ తెలిపారు. శనివారం ఆయన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అంశంపై వైకాపా నాయకులు నానా రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. 17 మెడికల్ కళాశాలలను తామే నిర్మించి పేద విద్యార్థులకు ఉచిత వైద్యం విద్యను అందిస్తామని నమ్మబలికారన్నారు. కేంద్రం ఇచ్చే నిధులు నాబార్డు నిధులను దుర్వినియోగం చేశారు. మదనపల్లె మెడికల్ కళాశాల సందర్శనలో భాగంగా వైకాపా నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, టిడిపి నాయకులు కోట్లు దోచేశారని ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పిపిపి విధానం ద్వారా మెడికల్ కళాశాలలు ఎంతో అభివృద్ధి చెందుతాయన్నారు. ఆరోపణలు మాని వైకాపా నాయకులు అభివృద్ధికి సహకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజన్న, నరసింహారెడ్డి, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ ఆంధ్ర స్వచ్ దివస్ కార్యక్రమం

**రామసముద్రం, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త**



రామసముద్రం మండల కేంద్రం,చెంబకూరు గ్రామ పంచాయతీలో శనివారం స్వచ్ ఆంధ్ర స్వచ్ దివస్ కార్యక్రమాన్ని ఎంపిడివో గఫూర్, రామసముద్రం జడ్పీ హైస్కూల్ హెచ్ ఎం చిట్టిబాబు, పంచాయతీ కార్యదర్శులు మునిస్వామి నాయక్, రెడ్డిశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం లోని జడ్పీ హైస్కూల్ స్కౌట్ విద్యార్థులు హెచ్ ఎం చిట్టిబాబు స్వర్ణాంధ్ర ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్ వద్ద మానవహారం ఏర్పడి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. చెంబకూరు బస్టాండ్ లో మానవహారం చేపట్టి,స్వచ్ ఆంధ్ర స్వచ్ దివస్ కార్యక్రమం పై ప్రజలకు ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి, అవగాహన కల్పించారు.వీరు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ గఫూర్, హెచ్ ఎం చిట్టిబాబు, పంచాయతీ కార్యదర్శులు మునిస్వామినాయక్, రెడ్డి శేఖర్, నారాయణస్వామి, సచివాలయ సిబ్బంది, సంఘమిత్ర సభ్యులు, పారిశుధ్య కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతి పంటను పంట నమోదు తప్పనిసరి

**ముద్దనూరు. సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:**



స్థానిక పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయావరణంలో శనివారం ఇంచార్జ్ తహసిల్దార్ శోభన్ బాబు, మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రెవిన్యూ, వ్యవసాయ కార్యాలయ సిబ్బందికి పంట నమోదుపై పురోగతిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులు సాగు చేసిన ప్రతి పంటను తప్పనిసరిగా పంట నమోదు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో క్షేత్రస్థాయి గ్రామ వ్యవసాయ,ఉద్యాన సహాయకులు మరియు గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం అలవర్చడమే లక్ష్యం

**పీలేరు సెప్టెంబర్ 20 ప్రభాతవార్త :**



ధ్రువపత్రాలు పొందిన విద్యార్థులు

విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, నైతిక విలువలు సేవా భావాన్ని అలవర్చడమే స్కౌట్స్ అండ్ గైడ్స్ ముఖ్య సిద్ధాంతమని అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం పీలేరు పట్టణంలోని శ్రీ భువన విద్యాలయంలో కొత్తగా స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల్లో శారీరక దారుఢ్యం పెంచడానికి, మానసిక స్థైర్యం నింపడానికి స్కౌటిజం తోడ్పడుతుందన్నారు. స్కౌట్ శిక్షణతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు సమకూరుతుందని చెప్పారు. అనంతరం జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహా రెడ్డి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ, ప్రవేట్ విద్యాసంస్థల్లో స్కౌట్ యూనిట్లను ఏర్పాటు చేయడం తప్పనిసరని అన్నారు. స్కౌట్ సర్టిఫికెట్లు పొందడం వల్ల విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు ప్రవేశ ధ్రువపత్రాలను డిఈఓ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి ఉప విద్యాశాఖ అధికారి వై. లోకేశ్వర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గుణలక్ష్మి, ఏఎస్ఓసి లక్ష్మీకర్, పాఠశాల స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఉపకులాల కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలి

**జమ్మలమడుగు, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:**

ఏపీ షెడ్యూల్డ్ కులాల ఉప కులాల కార్పొరేషన్లను ఏర్పాటు చేసినప్పటి నుంచి వారి సమగ్ర అభివృద్ధికి గత 6 సంవత్సరాల నుంచి బడ్జెట్ కేటాయించలేదని తక్షణమే నిధులు కేటటాయించాలని ఏపీఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు జమ్మలమడుగు ఏవోకు నిధులు కేటాయింపు తదితర డిమాండ్లపై వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఆర్‌పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## హత్య కేసులో భార్య, ఆమె తమ్ముడు అరెస్ట్

**మదనపల్లెక్రైం, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త.**



భర్తను హత్య చేసిన కేసులో భార్య రమణమ్మ(35), ఆమె తమ్ముడు ఈశ్వర్ (32) లను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు మదనపల్లి డిఎస్పి మహేంద్ర, రాజారెడ్డి లు తెలిపారు. డీఎస్పీ కథనంమేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సత్యసాయి జిల్లా తనకల్లు మండలం నందివారిపల్లెన చెందిన జరిపిటి రెడ్డప్ప కుమారుడు రామన్న మదనపల్లి పట్టణం రామారావు కాలనీలో నివాసం ఉన్నాడు. మద్యానికి బానిసైన రామన్న తెలిసిన వారి వద్ద అప్పులు కూడా చేశాడు. ఈ విషయమై భార్యాభర్తలిద్దరూ తరచూ ఘర్షణ పడేవారు. ఈ ఏడాది మార్చి 12వ తేదీ మధ్యాహ్నం డబ్బులు విషయమై భార్యాభర్తలిద్దరూ ఘర్షణ పడ్డారు. ఆ సమయంలో రమణమ్మ, ఆమె తమ్ముడు కర్రతో కొట్టి చంపారు. అనంతరం మృతదేహాన్ని పూడ్చి పెట్టారు. ఏమీ తెలియనట్లు భర్త ఆచూకీ కోసం గాలింపులు మొదలుపెట్టారు. మూడు నెలలుగా రామన్న కనపడకపోవడంతో పాటు ఫోను కూడ పనిచేయకపోవడంతో రామన్న సోదరుడు లక్ష్మన్న జూన్ 21వ తేదీ రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టడంతో రామన్న భార్య రమణమ్మ, ఈశ్వర్ల ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. శుక్రవారం వారిద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా, హత్య చేసినట్లు అంగీకరించారు. అనంతరం మృతదేహాన్ని పాతిపెట్టిన గోతిని తవ్వించారు. మృతి చెంది ఆరు నెలలు కావడంతో కేవలం ఎముకలే బయటపడ్డాయి. ఎముకలను డిఎన్ఏ పరీక్షలు నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్ కు పంపించినట్లు డి.ఎస్.పి తెలిపారు. ఈ కేసులో నిందితుల్ని అరెస్ట్ చేయడంలో ప్రతిభ చాటిన సిఐ రాజారెడ్డి, ఎస్సై రహీముల్లా, హెడ్ కానిస్టేబుల్ వేణులను డిఎస్పి అభినందించారు.

## యువతదే కీలక పాత్ర

**ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 20 ప్రభాత వార్త :**



ప్రధాని మోడి 75 వ జన్మదినం సందర్భంగా కేంద్ర యువ వ్యవహారాల మంత్రిత్వ శాఖ బ్రహ్మకుమారీస్ తో సంయుక్తంగా నిర్వహిస్తున్నదే వికసిత్ భారత్ కోసం నషాముక్త యువత కార్యక్రమం అని యువతను మాదకద్రవ్యాల నుండి పలు రకాల వ్యసనాల నుండి దూరం చేసే సరైన దిశా నిర్దేశాన్నిస్తూ నశాముక్త భారత్‌గా వికసిత్ భారత్ వైపు అడుగులు వేయిస్తూ 123 ఆధ్యాత్మిక సంస్థలతో నేడు దేశవ్యాప్తంగా వేలాది కార్యక్రమాలను నిర్వహిస్తూ యువతను జాగృతం చేస్తున్నట్లు ఓం శాంతి భవన్ నిర్వాహకురాలు బీకే శాంత తెలిపారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శ్రీ విద్యా జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజయోగ ట్రైనర్ బీకే సౌజన్య మాట్లాడుతూ విదేశీ వస్తువులపై విలాస వస్తువులపై ఆధారపడటం కూడా మనిషిని బానిసగా చేస్తుందని వర్తమాన సమయంలో చిన్న వయసు నుండే చాలా మంది పొగాకుకు మద్యం మాదకద్రవ్యాలు వంటి పలు రకాల వ్యసనాలకు బానిసలై తమను తాము మానసిక శారీరక రోగగ్రస్తులుగా అవుతూ ఉన్నారని ఈ వ్యసనాలు కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తూ కర్తవ్యంను విస్మరింపచేసి సమాజాన్ని బలహీనం చేస్తున్నాయని పేర్కొన్నారు. రాజయోగం ఎంతగానో ఉపకరిస్తుందని రాజయోగ సాధన తో సకారాత్మక చింతన పెరుగుతుందని ఉన్నతమైన భావాలు వ్యక్తిత్వంతో గొప్ప భవిష్యత్తును నిర్మించుకోవచ్చన్నారు. విద్యార్థుల చేత రాజయోగ సాధన చేయించి వికసిత భారత్ కై ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, ప్రిన్సిపల్ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

## మృతిచెందిన కుటుంబాలకు ఆర్థికసాయం

**గాలివీడు, సెప్టెంబర్ 20(ప్రభాతవార్త):**



భారీ వర్షాల కారణంగా నష్టపోయిన కుటుంబాలకు సహాయార్థం ఎన్ఆర్ఐ టీడీపీ నేత యూఎస్ఏ చెంచు వేణుగోపాల్‌రెడ్డి ఒక్కొక్కరికి రూ.15 వేలు విరాళం అందించడం జరుగుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలో సంభవించిన భారీ వర్షాలకు మృతిచెందిన బాధితులను ఆదుకునే నిమిత్తం తన వంతు సహాయం విరాళాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. పార్టీ కోసమే గాక, ప్రజల కోసం కూడా పరితపించే కార్యకర్తలు కేవలం టీడీపీకే సొంతమని చెంచు వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. రాయచోటి ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల కారనంగా నష్టపోయిన కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ భారీ వర్షం, వరద కారణంగా నాలుగు ప్రాణాలు కోల్పోవడం నిజంగా బాధాకరం పోయిన మనుషులను మనం తిరిగి తీసుకురాలేము గానీ ఆ కుటుంబానికి అండగా కూటమి ప్రభుత్వం, పార్టీ నాయకులు ఉంటారని వారిని అన్ని రకాలుగా ఆదుకుంటామన్నారు.

## ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు పాడికట్టిన ప్రభుత్వం

**సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈశ్వరయ్య**

**మదనపల్లి క్రైమ్ సెప్టెంబర్ 20 ప్రభాతవార్త.**




ప్రభుత్వ మెడికల్ కళాశాలకు రాష్ట్ర ప్రభుత్వం పాడికట్టిందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఈశ్వరయ్య విమర్శించారు. శనివారం మదనపల్లి నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి ముందు పాడిగట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ఓపెన్ మార్కెట్లో వ్యాపారం పెట్టి, పేదలకు వైద్యాన్ని దూరం చేస్తోందన్నారు. ముఖ్యమంత్రితో సహా చాలా మంది మంత్రులు పిపిపి అంటే ప్రైవేట్ కాదని చెప్పటం హాస్యాస్పదమన్నారు. పి పి పి ముసుగులో కార్పొరేటైజేషన్, కమర్షియలైజేషన్, కమ్యూనలైజేషన్, సెంట్రలైజేషన్ ను ఇంప్లిమెంట్ చేస్తుందన్నారు. ఆచరణకు సాధ్యం కాని బనకచర్లకు 81 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసే రాష్ట్ర ప్రభుత్వం, 8 వేల కోట్ల రూపాయలు మెడికల్ కళాశాలలకు ఎందుకు ఖర్చు పెట్టలేక పోతున్నారన్నారు. సిపిఐ మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శి కే మురళి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలను పిపిపి పద్ధతుల్లో మార్చడం దుర్మార్గమని, దీనివల్ల పేదలకు వైద్యం దూరం అవుతుందని, వైద్య విద్య పూర్తిగా వ్యాపారంగా మారుతుందని ప్రజా పోరాటాలు జరుగుతుంటే మదనపల్లి ఎమ్మెల్యే కళాశాల నిర్మాణాల్లో అవినీతి జరిగిందని కాకమ్మ కథలు చెబుతున్నారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిని కాపాడుతామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే ఎందుకు నోరు తెరవలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మురళి,రెడ్డి, నరేష్ మాధవ్, దేవా విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా పోషణ మాసోత్సవ కార్యక్రమం.

**చిట్వేలి,సెప్టెంబర్ 20,ప్రభాతవార్త:**

ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలను చిట్వేలి ఐసిడిఎస్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. శనివారం నాలుగవ రోజున స్థానిక ఎంపీడీవో సభాభవనంలో "సమన్వయ చర్యలు మరియు డిజిటలీకరణ"అనే థీమ్ తోఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో లబ్ధిదారుల అపార్ ఐడి, అభా ఐడి ల నమోదు కార్యక్రమంను పూర్తిస్థాయిలో చేపట్టారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిడిపిఓ నిర్మలా జ్యోతి మాట్లాడుతూ డిజిటలీకరణ ద్వారా ప్రతి లబ్ధిదారుని వివరాలు ఒకే ప్లాట్‌ఫాంలో పొందుపరచడం వలన పారదర్శకత పెరుగుతుందన్నారు. లబ్ధిదారులకు అందే అన్ని సేవలు, సదుపాయాలు సకాలంలో చేకూరతాయన్నారు. ప్రతి అంగన్వాడీ కార్యకర్త ఈ ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తున్నారని డిపార్ట్మెంట్ తరపున అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సూపర్వైజర్లు వసుంధరమ్మ, సురేఖ రాణి, విజయకుమారి లు సంబంధిత అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించి, వారిని ప్రోత్సహించారు. అంగన్వాడీ కార్యకర్తలు కూడా చురుకుగా పాల్గొని, లబ్ధిదారుల వివరాలను నమోదు చేశారు.



## ప్రణాళికతో ముందుకు వెళితే
# ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చు



రాయచోటి సెప్టెంబర్ 20 ప్రభాతవార్త

శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాయచోటి ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్, గెస్టఅప్ హానర్ ప్రసిద్ధి మోటివేషనల్ స్పీకర్ డీజీ రామ్మూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ మేనేజ్మెంట్ విద్యార్థులు తమ చదువును చక్కటి ప్రణాళికతో ముందుకు తీసుకెళ్లి తే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చున్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ టెక్నికల్ నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా మంచి ఉద్యోగ అవకాశాలను పొందవచ్చన్నారు. అనంతరం సాయి విద్యాసంస్థల కరస్పాండెంట్ కె.వి సుబ్బయ్య మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువతరమే ప్రతి విద్యార్థి విలువలతో కూడిన విద్యను అభ్యసించి దేశ నిర్మాణంలో భాగ్యస్వాములు కావాలన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ పేద బడుగు బలహీనవర్గాల విద్యార్థులకు కల్పవృక్షంలో నిలుస్తున్న ఈ సంస్థను నెలకొల్పిన కె పి వీ సుబ్బయ్యకు అధ్యాపకులుకు విద్యార్థుల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలాజీ వైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ అధ్యాపకులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సౌత్‌జోన్ మహిళా కబడ్డీ జట్టులో స్థానం



(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)

అన్నమాచార్య విశ్వవిద్యాలయ విద్యార్థినులు సౌత్‌జోన్ మహిళా కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. గురువారం జేఎన్టీయూఏ జట్టుకు ఎంపికలు అనంతపురం జిల్లా అనంతలక్ష్మి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో నిర్వహించబడ్డాయి. ఈ ఎంపికల్లో అన్నమాచార్య విశ్వవిద్యాలయం విద్యార్థినులు కే. అఖిల సాయి (4 బి.టెక్ - సిఎస్ఇ), కె. భవిత (4 బి.టెక్ - సివిల్ ఇంజినీరింగ్), ఎం. నికిత (3 బి.టెక్ - సిఎస్ఇ) ప్రతిభ కనబరిచి జట్టులో స్థానం దక్కించుకున్నారు. ఎంపికైన ఈ విద్యార్థినులు అక్టోబర్ 27 నుండి 31వ తేదీ వరకు మంగళూరు విశ్వవిద్యాలయం, కర్ణాటకలో జరగనున్న సౌత్‌జోన్ మహిళా కబడ్డీ పోటీలలో పాల్గొననున్నారు. ఈ విజయంపై అన్నమాచార్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డా. ఈ. సాయి బాబా రెడ్డి, ఏఐటీఎస్ రాజంపేట వైస్ చైర్మన్ సి. యెల్లా రెడ్డి, ఏఐటీఎస్ రాజంపేట ప్రిన్సిపాల్ డా. ఎస్. ఎం. వి. నారాయణ, అన్నమాచార్య విశ్వవిద్యాలయం శారీరక విద్యాధికారి డా. బి. నాగముని మరియు అడ్మిషన్ల డ్యూటీ డైరెక్టర్ డా. బి. జయరామ రెడ్డి విద్యార్థినులను అభినందించారు.

## ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



ప్రొద్దుటూరు సెప్టెంబర్ 20 ప్రభాతవార్త

మండల పరిధిలోని గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రామసుబ్బమ్మ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొద్దుటూరు డి. ఎస్.పి పూతి భావన హాజరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పి పుతి భావన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి విద్యార్థి దశలో ఫ్రెషర్స్ డే వేడుకలు చాలా ప్రత్యేకమైనవని అలాగే తన విద్యార్థి దశలో జరిగిన కొన్ని మంచి జ్ఞాపకాలను కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. అలాగే నేటి సమాజంలో మహిళలు ఉన్నతస్థాయిలో నిలబడడానికి విద్య చాలా అవసరమని, అలాగే తన జీవితంలో జరిగిన విద్యాభ్యాసము గురించి, తన ఉద్యోగ జీవితంలో జరిగిన విశేషాలను చెప్పడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు వారికి తగు సూచనల్ని తెలిపి విద్యార్థినిలను ఉత్తేజపరిచారు. కో డైరెక్టర్ శైలూష మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని డి.ఎస్.పి భావన ను ఆదర్శంగా తినుకాని తమ జీవితంలో ఉన్నత స్థాయిని చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి కళాశాల్ కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూరు, రవీంద్రారెడ్డి, కో డైరెక్టర్ శైలూష, డిప్లొమా కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాష్ రావు, వివిధ విభాగ అధిపతులు మహమ్మద్ జాబీర్, యాకూబ్ అలి, విజయమ్మ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణతోనే కాలుష్య నియంత్రణ



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే

మదనపల్లె, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త :

పర్యావరణాన్ని పరిరక్షించడంతోనే కాలుష్యాన్ని పూర్తిగా నివారించవచ్చునని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. శనివారం జిల్లాపరిషత్ హైస్కూల్ కోమిటివానిచెరువు వద్ద మున్సిపల్ కమీషనర్ ప్రమీళ ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. మొక్కలు నాటిన తరువాత నీరుపోసి సంరక్షించాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విధిగా చేపట్టాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మున్సిపాలిటి పరిధిలోని సుభాష్‌రోడ్డు నందు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లె రూరల్ మండలం, అర్బన్‌ల్లో 101 ప్రభుత్వ చౌకదుకాణాలు ఉన్నాయన్నారు. వీటి పరిధిలో 62.982 స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. వయో వృద్ధులకు, వికలాంగులకు ఇంటివద్దనే స్మార్ట్ రేషన్‌కార్డులను డీలర్లచే పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జనరల్ రేషన్‌కార్డుదారులకు డీలర్లచే ప్రభుత్వ చౌకదుకాణాల వద్ద పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి రేషన్‌కార్డు వినియోగదారుడు స్మార్ట్ రేషన్‌కార్డులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బాబునాయుడు, జేసిబి మధు, పులి మహాలక్ష్మీ, రాధ, షంషీర్, నాగమణి, మోడెం సిద్దప్ప, మల్లికార్జుననాయుడు తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో ముందస్తు దసరా వేడుకలు

మదనపల్లి సెప్టెంబర్ 20 ప్రభాతవార్త



మదనపల్లి మల్లికార్జున సర్కిల్‌లోని చైతన్య టెక్నో పాఠశాలలో ముందస్తు దసరా వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఏజీఎం సురేష్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ – దసరా అనేది ధర్మం పై అధర్మం, సత్యం పై అసత్యం విజయం సాధించే శుభపర్వం. విద్యార్థులు ఎల్లప్పుడూ సత్యం, నిజాయితీ, ధర్మబద్ధతను పాటిస్తూ ముందుకు సాగాలి అని సూచించారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ – దసరా పండుగ సాంప్రదాయం, సంస్కృతి, ఆధ్యాత్మికతల సమ్మేళనం. విద్యార్థులు విద్యతో పాటు సంస్కృతిని కూడా ఆచరించి, సాంప్రదాయాలను కాపాడుకోవాలి అని ప్రేరేపించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అందర్నీ ఆకట్టుకోగా, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పాటలు, ప్రసంగాలు వేడుకలకు మరింత అందాన్ని చేకూర్చాయి. ఈ కార్యక్రమంలో డీన్ నూర్, సి బ్యాచ్ ఇంచార్జ్ వెంకటేష్, ప్రైమరీ ప్రీ ప్రైమరీ ఇన్చార్జెస్,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని పాఠశాల ఆవరణలో ఉత్సాహ వాతావరణాన్ని నింపారు.

## రేపటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

లక్కిరెడ్డిపల్లి : సెప్టెంబర్ 20, ప్రభాత వార్త



మండల కేంద్రంలోని విశ్వభారతి పాఠశాల సమీపంలో వెలసిన శ్రీ సర్వమంగళా దేవి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో రేపటి నుంచి దసరా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు జరగనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు ఓబులేశ్వరమ్మ, చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ ధర్మకర్తలు గొర్ల భుదేవమ్మ , గొర్ల మోహన్ రెడ్డి , ఆలయ ప్రధాన అర్చకులు శ్రీహరి స్వామి, ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ 22 వ తేదీ బాలాత్రిపుర సుందరీ దేవి , 23 వ తేదీ గాయత్రీ దేవి , 24 వ తేదీ శ్రీ అన్నపూర్ణేశ్వరి దేవి , 25 వ తేదీ శ్రీ గౌరీ దేవి , 26 వ తేదీ శ్రీ మహాలక్ష్మి దేవి , 27 వ తేదీ శ్రీ లలితాంబికా దేవి , 28 వ తేదీ శ్రీ సంతానలక్ష్మి , 29 వ తేదీ శ్రీ సరస్వతి దేవి , 30 వ తేదీ శ్రీ దుర్గాదేవి , 01 వ తేదీ శ్రీ మహిషాసుర మర్దిని దేవి , 02 వ తేదీ గురువారం శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంలో శ్రీ సర్వమంగళ దేవి అమ్మవారు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ దసరా ఉత్సవాలకు సంబంధించి ప్రతీ రోజు కుంకుమార్చన , అభిషేకం , మంగళహారతి ఉంటుందన్నారు. కాబట్టి అమ్మవారి ఉభయం చేయించుకునే భక్తులు ఎవరైనా ఉంటే 9502639099 , 9502134940 , 9347855966 లకు సంప్రదించి మీ అమూల్యమైన పేరును నమోదు చేసుకోగలరని కమిటీ సభ్యులు తెలిపారు.

## విజయానికి ప్రతి కథ దసరా వేడుకలు



సంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

పీలేరు సెప్టెంబర్ 20 ప్రభాతవార్త :

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా పండుగను వేడుకగా జరుపుకుంటారని శ్రీచైతన్య పాఠశాల ఏజీఎం జి. సురేష్ తెలిపారు. శనివారం పీలేరులోని శ్రీచైతన్య పాఠశాల శాఖ 1లో ముందస్తు దసరా వేడుకల సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పండుగ ప్రాధాన్యతను వివరిస్తూ దసరా పండుగను నవరాత్రి ఉత్సవాలుగా కూడా ఆచరిస్తారని, ఈ సమయంలో దుర్గాదేవిని ఒక్కొక్క రోజు ఒక్కోరకంగా ప్రత్యేక అలంకరణ చేసి పూజించడం ఆనవాయితీ అని అన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొంటూ పండుగ విషయాలు, విశేషాలను తెలుసుకుని మన సాంప్రదాయాలను భావితరాలకు తెలియజేయడం మనందరి బాధ్యతని చెప్పారు. ముందస్తు దసరా వేడుకలో భాగంగా విద్యార్థులు దుర్గాదేవి వేషధారణ, సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా శ్రీ చైతన్య పాఠశాల ఏజీఎంతో పాటు ఆర్ఐపి పి. శ్రీధర్ హాజరయ్యారు. కార్య క్రమంలో ప్రిన్సిపాల్ జె. సుమన్ గౌడ్, సమన్వయకర్త రవికుమార్, డీన్. యు. జానకీ రామ్, ప్రైమరీ, ప్రీ ప్రైమరీ ఇన్చార్జ్ ఏ. అనూష, కె. చరిత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# మైనారిటీ యేతర పాఠశాల ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి

(సుప్రీం కోర్టు ఆదేశం)

బద్వేలు లీగల్, సెప్టెంబరు 20 ప్రభాతవార్త :

ఉపాధ్యాయులుగా నియామకం కోరుకునే వారికి మరియు ప్రమోషన్స్ కోరుకునే ఇన్‌సర్వీస్ టీచర్స్‌కు ఉపాధ్యాయ అర్హత పరీక్ష అనగా టెట్ అర్హత సాధించడం తప్పనిసరి అని సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. 2009 సంవత్సరంలో విద్యా హక్కు చట్టం క్రింద పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్యను అమలు చేయడానికి ముందు నియమితులైన 5 సంవత్సరాల కంటే ఎక్కువ సర్వీసు మిగిలి వున్న ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత సాధించడానికి కోర్టు 2 సంవత్సరములు గడువు ఇవ్వడం జరిగింది. అదే సమయంలో విద్యా హక్కు చట్టం క్రింద మైనారిటీ విద్యా సంస్థలకు టెట్ నిబంధన వర్తించదని కూడా కోర్టు సుస్పష్టం చేసింది. మైనారిటీ పాఠశాలలకు ఆ చట్టం వర్తింపు గురించిన సమస్యపై ఉన్నత స్థాయి ధర్మాసనం నిర్ణయించేంత వరకూ ఇదే విధానం కొనసాగుతుందని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. 2011 జూలై 29న నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సిటిఇ) ఉపాధ్యాయ నియామకానికి టెట్ అర్హత తప్పనిసరి చేసింది. అయితే వాస్తవాలను పరిగణన లోనికి తీసుకుంటూ 5 సంవత్సరముల కంటే తక్కువ సర్వీస్ మిగిలి వున్న ఉపాధ్యాయులు ఒకవేళ పదోన్నత కోరుకుంటే తప్పకుండా టెట్ అర్హత పొందాల్సి వుంటుందని సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పును వెలువరించింది. ఉపాధ్యాయులు తాము అనుమతించిన సమయంలో టెట్ అర్హత సాధించలేకపోతే వారు సర్వీస్‌ను విడిచిపెట్టవలసి వుంటుందని కూడా నొక్కి వక్కానించింది. వారు నిర్బంధ పదవీ విరమణ చేసి టెర్మినల్ బెనిఫిట్స్‌ను పొందవచ్చును. టెర్మినల్ ప్రయోజనాలకు అర్హత సాధించడానికి అటువంటి ఉపాధ్యాయులు నిబంధనల ప్రకారం సర్వీస్‌లో చేరి వుండాలి. ఎవరైనా ఉపాధ్యాయులు నిబంధనల ప్రకారం చేరనట్లయితే ఆ విషయాన్ని సంబంధిత విభాగం చూసుకోవాల్సి ఉంటుంది. విద్యా హక్కు చట్టం మైనారిటీ పాఠశాలలకు వర్తించదని 2014 లో రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై కూడా కోర్టు సందేహం వ్యక్తం చేసింది. అయితే ఉన్నత స్థాయి బెంచ్ దీనిపై నిర్ణయించేంత వరకూ మైనారిటీ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు టెట్ నిబంధన వర్తించదని కోర్టు పేర్కొన్నది. విద్యా హక్కు చట్టంలోని సెక్షన్-2(ఎస్) లో నిర్వచించినట్లుగా అన్ని పాఠశాలలు ఆ చట్టం పరిధిలోనికి రావాల్సిందేనని మేము విశ్వసిస్తున్నాము అని సుప్రీం కోర్టు ధర్మాసనం తెలియజేస్తూ తీర్పును వెలువరించింది. (అంజుమన్ ఇషాత్ ఇ తాలీం ట్రస్ట్ ఎదిరి ది స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర అండ్ అదర్స్ ఎసిఎ నెం.1385/2025)

## ముందస్తు దసరా వేడుకలు..



వేంపల్లి:సెప్టెంబర్ 20:(ప్రభాత వార్త)

వేంపల్లి చైతన్య హైస్కూల్‌లో ముందస్తు దసరా వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. పాఠశాల మొత్తం పూలతో, మామిడి తోరణాలతో, రంగురంగుల రంగోలీలతో అలంకరించబడింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమకూరడంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. కార్యక్రమం ప్రత్యేక పూజతో ప్రారంభమైంది. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను అద్భుతంగా ప్రదర్శించారు. చిన్నారులు భక్తి గీతాలు పాడగా, పెద్ద తరగతి విద్యార్థులు వివిధ నృత్యాలు, నాటికలు, స్కిట్స్ ప్రదర్శించారు. ప్రతి ప్రదర్శనలోనూ దసరా పండుగలోని "ధర్మం చెడుపై గెలుస్తుంది" అనే స్ఫూర్తిదాయక సందేశం ప్రతిబింబించింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ చక్రపాణి రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో పిల్లల ప్రతిభను ప్రోత్సహిస్తూ నిర్వాహకులు వారికి బహుమతులను అందజేశారు. బహుమతులు స్వీకరించిన విద్యార్థులు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. ముందస్తు దసరా సంబరాలు విద్యార్థుల్లో ఆనందం నింపడమే కాక, మన సాంప్రదాయాలను, విలువలను గుర్తు చేశాయి.

## వాహనాలు తనిఖీ

జమ్మలమడుగు, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:

దొంగతనాలు మరియు చైన్ స్నాచింగ్‌లను అరికట్టడంలో భాగంగా శనివారం జమ్మలమడుగు సీఐ తమ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. నంబర్ ప్లేట్లు లేకుండా బైక్‌లు నడుపుతున్న వాహనాలనఉ ఆపి తనిఖీ చేయడం జరిగింది. పత్రాలు సరిగా లేని వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మండలంలో జడ్పీ సీఈవో పర్యటన

పెండ్లిమర్రి, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:

పెండ్లిమర్రి మండలంలోని పెండ్లిమర్రి గ్రామంలో జడ్పీ సీఈవో ఓబులమ్మ శనివారం పర్యటించారు. పలు అంగళ్ల వద్ద శానిటేషన్ గురించి తనిఖీ చేశారు. రోజూ చెత్త సేకరణ జరుగుతుందా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



# చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తులపై దృష్టి సారించాలి

పులివెందుల, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:

చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తులపై దృష్టి సారించాలి అని అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ అన్నారు. పులివెందులలోనీ ఆహార విజ్ఞాన శాస్త్ర మరియు సాంకేతిక కళాశాలలో "చిరుధాన్యాల విలువ జోడింపు, మార్కెటింగ్ మరియు బ్రాండింగ్" అనే అంశం మీద రెండు రోజులు అనగా 19 మరియు 20 సెప్టెంబర్ తేదీలలో శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మాధవ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు మరియు విజయనగరం జిల్లాల నుంచి వచ్చిన ఎఫ్.పి.ఓ లకు చెందిన 29 మంది రైతులకు అభినందనలు తెలిపి వారితో మాట్లాడారు. చిరుధాన్యాలు, పండ్లు పండిస్తున్న రైతులు ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు హాజరుకావటం వలన పండ్లు మరియు చిరుధాన్యాలు ప్రాసెసింగ్ పద్ధతులు తెలుసుకోవడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.ఈ శిక్షణా కార్యక్రమం ఆహార విజ్ఞాన శాస్త్ర మరియు సాంకేతిక కళాశాల, పులివెందుల మరియు ఐ.ఐ.పి.యం, బెంగళూరు, ఫ్రెండ్స్ ఆఫ్ ఉమెన్స్ వరల్డ్ బ్యాంకింగ్ సొసైటీ సంయుక్తంగా కళాశాలలో నిర్వహించారు. శిక్షణ కార్యక్రమాలలో భాగంగా కళాశాలలో ఉన్న పండ్లు నుంచి జ్యూస్ బాటిలింగ్ ఆటోమేటిక్ యంత్రాలు, చిరుధాన్యాల శుభ్రపరిచే యంత్రాలు, చిరుధాన్యాల నుండి రవ్వ, పిండి చేసే యంత్రాలును ఉపయోగించి రైతులు ప్రత్యక్షంగా ఆహార పదార్థాలు తయారు చేసే ప్రక్రియలో పాల్గొనేలా చేశారు. అలాగే రకరకాల పండ్లతో కస్టర్డ్ డ్రింక్, జల్ జీరా డ్రింక్, ను జామ్, జెల్లీ, రకరకాల చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేయు విధాన ప్రక్రియలో కూడా స్వయంగా రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఇంజనీర్ నజ్మా, డాక్టర్ సాయి శ్రీనివాస్ కళాశాలలో ఉన్న లైవ్లీహుడ్ బిజినెస్ ఇంక్యుబేషన్ సెంటర్ లో ఉన్న యంత్రాల పనితీరును వివరిస్తూ సాంకేతిక సమాచారాన్ని రైతులకు అందించారు. ఐ.ఐ.పి.యం. బెంగళూరుకు చెందిన డాక్టర్ నబి రసూల్ చిరుధాన్యాల మార్కెటింగ్ మరియు వాటి బ్రాండింగ్ అనే అంశం మీద రైతులకు వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్. మాధవ, కళాశాల లైవ్లీహుడ్ బిజినెస్ ఇంక్యుబేషన్ సెంటర్ అధికారి ఇంజనీర్ నజ్మా, ఐ.ఐ.పి.యం. బెంగళూరుకు చెందిన డాక్టర్ నబి రసూల్, కళాశాల అధ్యాపకులు డాక్టర్ రాజేష్, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ జాకిర్ భాషా, పీడి డాక్టర్ రాజశేఖర్, అల్లూరి సీతారామరాజు మరియు విజయనగరం జిల్లాల ఫ్రెండ్స్ ఆఫ్ ఉమెన్స్ వరల్డ్ బ్యాంకింగ్ సొసైటీ సభ్యులు, ఎఫ్.పి.ఓ లకు చెందిన 29 మంది రైతులు, కళాశాల రెండవ సంవత్సర విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



యంత్రాల ద్వారా విత్తనాలు శుద్ధినీ రైతులకు వివరిస్తున్న దృశ్యం

## మొక్కలు నాటిన మున్సిపల్ కమిషనర్

మైదుకూరు, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త:

మైదుకూరు మున్సిపాలిటీ బద్వేల్ రోడ్డు లో ఉన్న పురాతన ఆలయం ఆవరణంలో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర లో భాగంగా యల్లంపల్లి 3వ వార్డులో ఉన్న తిరుమల నాథ స్వామి దేవాలయం ప్రాంగణం లోని గుట్టపైన మొక్కలు నాటు కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసులు రెడ్డి మరియు మునిసిపాలిటి సిబ్బంది తదితరులు పాదులు తీసి మొక్కలు నాటడం జరిగింది. అనంతరం మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని భవిష్యత్ తరాలకు పరిసరాలు పరిశుభ్రత ప్రతి ఒక్కరు ఒక మొక్క అయినా నాటడం చేయాలని దీనివల్ల పర్యావరణాన్ని కాపాడువచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఆత్మరక్షణ ప్రతి ఒక్కరికి అవసరం

ప్రొద్దుటూరు క్రైం, సెప్టెంబరు 20, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు సబ్ డివిజన్ శక్తి టీం బృందం ఆధ్వర్యంలో వై.వి.సుబ్బమ్మ పురపాలక బాలికోన్నత పాఠశాలలో ఆత్మరక్షణ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ప్రొద్దుటూరు డీఎస్పీ శ్రీమతి పి.భావన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపద కాలంలో ఆత్మరక్షణ ప్రతి ఒక్కరికి అవసరమని తమకు తాము ధైర్యంగా ఉంటూ అగంతకుల బారి నుంచి సురక్షితంగా తప్పించుకోవడం ముఖ్యమైన అంశమని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ఆత్మ రక్షణ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శిక్షణలో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసేలా సహకరించిన స్కూలు ఉపాధ్యాయులు, కరాటే మాస్టర్లకు పోలీసు శాఖ తరుపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీం ఇన్‌ఛార్జి ఎస్ఐ కేపీబీ వెంకటరెడ్డి, హెడ్ మాస్టర్ విజయ భాస్కర్, శక్తి టీం సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.



# వైభవంగా దసరా ఉత్సవాలు

బద్వేల్ అర్బన్ సెప్టెంబర్ 20 ప్రభాతవార్త :



బద్వేల్ పట్టణంలోని పోరుమామిళ్ల రోడ్డు లోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయంలో ఈనెల 22వ తారీకు సోమవారం నుండి అక్టోబర్ మూడో తారీకు వరకు దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయం కమిటీ ఆలయ శాశ్వత ధర్మకర్త ప్రొద్దుటూరు కిషోర్ కుమార్, అధ్యక్షులు దేవతి సురేంద్ర, వైస్ ప్రెసిడెంట్ వడ్లపూడి నాగభూషణం, తిరివీధి లక్ష్మణరావు, ఓబుల శెట్టి చిన్న సుబ్బరాయుడు, జాయింట్ సెక్రెటరీ చిప్పగిరి ఆంజనేయులు, దేవతి వెంకట సుధాకర్, యువజన సంఘం గౌరవ అధ్యక్షులు పత్తి సాయి పవన్, ప్రెసిడెంట్ చిన్ని సత్యనారాయణ,వైస్ ప్రెసిడెంట్ ప్రొద్దుటూరు సాయి కార్తీక్, ఇమ్మడిశెట్టి హరి మనోజ్, సెక్రెటరీ గూడూరు తరుణ్, నవీన్ సముద్రాల, అడ్వైజర్ కొప్పరపు తరుణ్, జాయింట్ సెక్రటరీ మిట్ట సాయికుమార్, ఛీదల్ల జగదీష్, ట్రెజరర్ ఒరుగంటి సాహసమిత్ర, కొప్పరపు గురు అంకిత్, జాయింట్ ట్రెజరర్ సముద్రాల సుబ్బారావు, మిట్టా సతీష్ కుమార్, మరియు పలువురు యువజన కమిటీ సభ్యులు తెలిపారు, ఈ సందర్భంగా శనివారం స్వామివారి ఉత్సవాల పుస్తకాలను కమిటీ సభ్యులు పట్టణంలోని పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, వ్యాపారస్తులు ఇంటింటికి ప్రతి షాపుకు అందజేయడం జరిగింది. అనంతరం పలువురు కమిటీ సభ్యులు మాట్లాడుతూ శ్రీ భద్రకాళి సమేత భద్రస్వామి దేవాలయంలో ఈ నెల 22వ తారీఖున నుండి మూడో తారీకు వరకు దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని పలువురు తెలియజేశారు, దసరా ఉత్సవాలలో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ముందస్తుగా అన్ని రకాల ఏర్పాట్లను నిర్వహించడం జరిగిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దసరా ఉత్సవాలలో స్వామివారికి రకరకాల అలంకారాలతో వైభవంగా నిర్వహించేందుకు అన్ని రకాల పూర్తి ఏర్పాట్లను చేపట్టడం జరిగిందన్నారు, కావున దసరా ఉత్సవాలలో పట్టణ పరిసర ప్రాంత భక్తులు ప్రజలందరూ విశేష సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని దసరా ఉత్సవాలను జయప్రదం చేయాలని పలువురికి కమిటీ సభ్యులు తెలియచేశారు.



## మహాత్మ జ్యోతిబాపూలే విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక



మైదుకూరు, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త:

కడప జిల్లా మైదుకూరు మండలంలోని వనిపెంట జిల్లా పరిషత్ హై స్కూల్ లో జరిగిన 6ఏ సైడ్ హ్యాండ్ బాల్ గేమ్ నందు జిల్లాస్థాయిలో జరిగిన పోటీలలో మహాత్మ జ్యోతిబాపూలే వెనకబడిన తరగతుల బాలికల సంక్షేమ పాఠశాల వనిపెంట ఆరుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనారు.10వ తరగతి నుండి అపూర్వ ,కుసుమ 9 వ తరగతి నుండి హిమబిందు, దివ్య, స్నేహ, అమీరూన్, వీరిని ప్రిన్సిపల్ నిర్మల అభినందనలు తెలిపారు. మహాత్మ జ్యోతిబాపూలే వెనకబడిన తరగతుల బాలికల సంక్షేమ పాఠశాల ప్రిన్సిపల్ నిర్మల మాట్లాడుతూ విద్యార్థుల్లో చైతన్యం ఇంకా రావాలని చదువుతోపాటు గేమ్స్ ఇతర వాటిల్లో కూడా రాణించాలని కొనియాడారు.

## రేపటి నుంచి దసరా మహోత్సవాలు

ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త:

పట్టణంలోని మెయిన్ బజార్ లో వున్న శ్రీ వాసవీ మత్యన్యకా పరమేశ్వరీ దేవి ఆలయం (అమ్మవారిశాల) లో రేపటి నుంచి దసరా మహోత్సవం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని బుశెట్టి రామ్మోహన్ రావు, మురికి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక అమ్మవారిశాలలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబరు 3 వ తేదీ వరకు అమ్మవారిశాలలో దసరా మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా తొలి రోజు సోమవారం 102 మంది ఆర్యవైశ్య సుహాసినులచే అమ్మవారిశాల నుండి కలశాలతో బయలుదేరి శివాలయంలో నవగంగ తీర్థములు, తెల్లాకుల శివయ్య గారి నగరేశ్వర స్వామి ఆలయం నుండి శ్రీ వాసవీ పురాణం తీసుకుని వస్తామని, ఈ క్రమంలో హర్యానా వారి భంభం భోలే అరోరా ప్రోగ్రామ్, భోపాల్ శివశక్తి డ్రమ్స్, కోదండ రామ కోలాట బృందం కళాకారులచే కోలాటం నిర్వహిస్తున్నామని వివరించారు. అదే విధంగా 29వ తేదీ సోమవారం బిందెసేవ సందర్భంగా చిక్ మంగలూరు వారి ప్రోగ్రామ్, అక్టోబర్ 2 విజయదశమి పర్వదినం సందర్భంగా శమీ దర్శనానికి వాసవాంబ వెళ్లే సమయంలో పాలకొల్లు బ్యాండ్, కేరళా బ్యాండ్, కోదండ రామ కోలాట బృందం కళాకారులచే కోలాటం, రాత్రి డూప్స్, వేషధారులు, పాలకొల్లు బ్యాండ్, కేరళా బ్యాండ్, కాంతార ప్రోగ్రామ్, క్రాకర్స్ నిర్వహిస్తున్నామని తెలియజేశారు. అక్టోబర్ 3 వ తేదీ వసంతోత్సవం సందర్భంగా తప్పెట్లతో అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమంలో విధిగా పాల్గొని వాసవీ మాత కృపకు పాత్రులు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ రవీంద్ర బాబు, జాలాది పరమేష్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్యవైశ్య సభ సభ్యులు